MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి :19 సంచిక: 2 రంగారెడ్డి అక్టోబర్ 2020 పేజీలు : 36 వెల : రూ. 10/-

## స్మరజిత్ రే సంస్మరణ . . .





ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో స్మరజిత్ రే స్మారక వార్షిక కార్యక్రమం

## నాబార్డ్ మెచ్చిన ప్రచురణలు !





ఎఫ్ పి ఓ ల పాలకవర్గానికి ఉపయుక్తంగా ఏపిమాస్ రూపొందించిన ప్రచురణలు నచ్చి నాబార్డ్ (తెలంగాణా ఆర్ ఓ) వాటిని తిరిగి ముద్రించింది. ఆ ప్రచురణలను ఆవిష్కరిస్తున్న తెలంగాణా వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి, డాక్టర్ బి. జనార్దన రెడ్డి. ఆయనకు కుడివైపున నాబార్డ్ (టి ఎస్) సి జి ఎం శ్రీ వై. కృష్ణారావు.. ఎడమవైపున నాబార్డ్ (ఏపి) సిజిఎం శ్రీ సుధీర్ జన్నావర్ . క్రింది చిత్రంలో శ్రీ కృష్ణారావు. బృందంతో ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ని చూడవచ్చు .

## ఏపిమాస్ శిల్పులు ... శిల్పాలు!



శ్రీ బి. వెంకటేశులు
ప్రాజెక్ట్ కోఆర్డినేటర్
ఏపిమాస్



శ్రీమతి సరోజమ్మ
గ్రామ రైతు సంఘం
కార్యదర్శి





వి కోట, పలమనేరులలో ఎఫ్ డి సి ల ప్రారంభోత్సవ దృశ్యాలు

Brot für die Welt బ్రెడ్ ఫర్ ది వరల్డ్ సౌజన్యంతో

# ఏపిమాస్ ఎఫ్ పి ఓ లు, ఎఫ్ పి సి ల వార్షిక సర్వసభ్య సమావేశాల సంరంభం




ఆజీవ  ఎఫ్ పి ఓ వార్షిక సర్వసభ్య సమావేశం



జైకిసాన్ ఎఫ్ పి ఓ




భూమాత ఎఫ్ పి ఓ వార్షిక సర్వసభ్య సమావేశం



ఎమ్మిగనూర్ ఎఫ్ పి సి




పెద్దవడుగూరు ఎఫ్ పి ఓ వార్షిక సర్వసభ్య సమావేశం



గోనెగండ్ల ఎఫ్ పి సి




ధరణి ఎఫ్ పి ఓ వార్షిక సర్వసభ్య సమావేశం



మిడ్తూరు ఎఫ్ పి ఓ




ధీశాలి ఎఫ్ పి సి వార్షిక సర్వసభ్య సమావేశం



బొల్లవరం ఎఫ్ పి ఓ

# మహిళా సాధికారత


సంపుటి 19 సంచిక 2



సంపాదకీయం

## కొత్త చట్టాలు !

**ఎఫ్** పి ఓ లు లేదా ఎఫ్ పి సి లు అని వ్యవహరించే రైతు ఉత్పత్తిదారుల సంస్థలు లేదా వ్యవసాయ ఉత్పాదక సంస్థలు, లేదా రైతు సమాఖ్యలు పేరేదైనా, అన్నిచోట్ల కాకపోయినా చాలాచోట్ల ఉత్సాహంగా పనిచేస్తూ ఆశించిన లక్ష్యం దిశగా తొలి అడుగులు వేస్తుండడం ఆహ్వానించదగిన పరిణామం. నిజానికి ఎఫ్ పి ఓ ల ఆవిర్భావమే ఒక కొత్త ప్రయోగం. గతంలో ఈ రీతిగా రైతులు సంఘటితంగా, ఉమ్మడిగా వ్యవసాయ కార్యక్రమాలను నిర్వహించిన సందర్భాలు లేకపోలేదు. ప్రాథమిక వ్యసాయ సహకార సంఘాల ద్వారా ఇలాంటి ప్రయోగాలు కొన్ని జరగకపోలేదు. కాని వివిధ కారణాలవల్ల చాలాచోట్ల అవి అంతగా ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ఎఫ్ పి ఓ ల ఏర్పాటుతో నిస్సందేహంగా వ్యవసాయ రంగంలో కొత్తగాలులు వీచడం మొదలైంది. ప్రభుత్వాలు కూడా ఎఫ్ పి ఓ ల ఏర్పాటును ప్రాధాన్యతాంశంగా పరిగణిస్తుండడం కలసివచ్చే అంశం. అయితే, చాలావరకు ఎఫ్ పి ఓలు ఇప్పటికీ ప్రోత్సాహక సంస్థల మార్గదర్శకత్వంలో పాఠాలు నేర్చుకుంటూ, తొలిఅడుగులు సరిగానే వేయగలుగుతున్నాయికాని, తమంతతాముగా మలిఅడుగులు వేయడానికి వెనకాడుతున్నాయి. అవి ఇంకా శైశవ దశ దాటకపోవడం ఇందుకొక ప్రధాన కారణమైతే, ఎఫ్ పి ఓ మూలసూత్రాన్ని అవగాహనచేసుకుని, అందుకు అనుగుణంగా ఎదిగే ప్రయత్నం జరగకపోవడం మరొక కారణం. ముఖ్యంగా రైతు దృక్పథంలో రావలసిన మార్పే ఒకప్పటి రైతు సంఘాలకు, ఇప్పటి ఎఫ్ పి ఓ లకు వున్న ప్రధానమైన తేడా! రైతు అంటే కేవలం పండించడానికే పరిమితం అనేది ఒకనాటి మాట. ఆ భావన వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి, రైతులను ఆత్మహత్యల బాట పట్టించి, రైతుగా వుండడానికి జనం విముఖత చూపే స్థితిని తెచ్చింది. ఇందుకు భిన్నంగా తన వ్యవసాయానికి సంబంధించినంతవరకైనా వ్యాపార దృక్పథాన్ని కూడా అలవరచుకుంటేనే రైతు మనుగడ, వ్యసాయ రంగాభివృద్ధి సజావుగా సాగుతాయనేది ఎఫ్ పి ఓ ల ప్రధాన సూత్రం. ఈ మౌలికమైన తేడాను అర్థంచేసుకుని వ్యవహరిస్తేనే ఎఫ్ పి ఓ ల ప్రయోగం విజయవంతమవుతుంది. 'రైతే అన్నదాత, రైతేరాజు' అన్న మాటలు ఎలావున్నా, రైతులు కనీసం తమ బతుకుదెరువుకైనా ఢోకా లేకుండా, నష్టాలసాగుతో కునారిల్లిపోకుండా, సామాజికంగా చిన్నచూపునకు గురి కాకుండా తగిన ఆర్థిక స్తోమతతో హుందాగా జీవించగలుగుతారు. ప్రోత్సాహక సంస్థగా ఏపిమాస్ తన నిర్వహణలోని ఎఫ్ పి ఓ లకు అవసరమైన శిక్షణలు, అండదండలు యిస్తూనే అవి స్వశక్తితో మరింత ఎదగాలని కోరుకుంటున్నది. సమాచార విప్లవంతో మొత్తం ప్రపంచమంతా అరచేతిలో ఇమిడిపోయే సానుకూల వాతావరణంలో రైతులు కొనుగోళ్ళు, అమ్మకాల విషయంలో అందుబాటులో వున్న అన్ని అవకాశాలపై అవగాహన పెంచుకుని పెట్టుబడుల ఖర్చులు తగ్గించుకుని, తమ ఉత్పత్తులపై ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను నిత్యం అన్వేషిస్తూ, అనుసరిస్తూ వుంటేనే ఎఫ్ పి ఓల ప్రయోగం సఫలమవుతుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంపై తీసుకువచ్చిన కొత్త చట్టాలను కూడా ఈ దృక్పథంతోనే పరిశీలించాలి. వాటిపై రైతులోకంలో, సమాజంలో విస్తృతమైన చర్చ జరగాలి. భారతదేశంవంటి విశాల దేశంలో పరిస్థితులు, ముఖ్యంగా వ్యవసాయ పరిస్థితులు అన్నిచోట్ల ఒకే రకంగా వుండవు. కొన్ని సానుకూలాలు, కొన్ని ప్రతికూలాలు వుంటాయి. ఎఫ్ పి ఓ లు ఇప్పటికే కొన్ని కార్పొరేట్‌సంస్థలతో అనుసంధానమై కొనుగోళ్ళు, అమ్మకాలు సాగిస్తున్నాయి. వీటిలోని సాధకబాధకాల నేపథ్యంలో ఈ కొత్త చట్టాల పరిశీలన జరగాలి. ప్రపంచవ్యాప్తంగా మారిన పరిస్థితులను దృష్టిలో వుంచుకుని ఏది రైతుకు లాభమో, ఏది నష్టమో బేరీజు వేయాలి. ఒకనాటి రైతు, ఒకప్పటి వ్యవసాయం ఇప్పుడు లేవు. అదే అవగాహనతో నేటి వ్యవసాయరంగాన్ని చూడాలనుకోవడం కుదరదు. అయితే, సంస్కరణల ముసుగులో మేలు కంటె కీడు ఎక్కువ జరుగుతుందా అనేది నిక్కచ్చిగా నిగ్గుతేల్చుకోవడం అవసరం. వాటర్‌షెడ్ల నిర్వాహక సంస్థగా, ఎఫ్ పి ఓ ల ప్రోత్సాహక సంస్థగా వ్యవసాయరంగంతో అనుబంధాన్ని పెంచుకున్న ఏపిమాస్ కూడా ఈ చట్టాల మేలుకీళ్ళపై చర్చాగోష్ఠులు నిర్వహిస్తున్నది. వ్యసాయ ప్రధానమైన మన దేశంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన ఏ సంస్కరణ అయినా, ఏ చట్టమైనా అంతిమంగా రైతుకు, వ్యవసాయ రంగానికి మేలుచేసేవైతేనే ఆమోదయోగ్యమవుతాయి, దేశాభివృద్ధికి తోడ్పడతాయనే వాస్తవాన్ని విస్మరిస్తే మాత్రం రైతు ప్రగతి తోపాటు దేశ ప్రగతి కూడా కుంటుపడుతుంది. తస్మాత్ జాగ్రత!



Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:T.Chandra Sekhar Reddy**

ఒకరికి తోడ్పడడంవల్ల నీలో కలిగే ఆనందంచూడు.. ఆ అనుభూతికి మరేదీ సాటి రాదని నీ గుండె చెప్పడంలేదూ?

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....

- మహిళా వ్యవసాయమంటే ప్రకృతి సంరక్షణే ...05
- 5 రోజులపాటు సి ఎస్ బృందం పరిశీలన ...07
- ఆజీవ మహిళా ఎఫ్ పి సి 3వ వార్షిక మహాసభ ...09
- జై కిసాన్ ఎఫ్ పి ఓ రెండవ వార్షిక మహాసభ ...11
- ధరణి ఎఫ్.పి.ఓ ద్వితీయ వార్షిక మహాసభ ... 12
- చిత్తూరులో ఎఫ్‌పిఓ ల వార్షిక మహాసభలు ...14
- పాడిపశువులలో పునరుత్పత్తికి జాగ్రత్తలు ! ...16
- సేవారంగంలో వెంకటేసులు శిక్షణలు ...18
- మహిళా చైతన్యానికి మారుపేరు సరోజమ్మ! ...19
- పాడిపశువులలో లంపి చర్మ వ్యాధి వ్యాప్తి ...25
- వివాహ వయస్సు పెంపు యోచనపై వ్యతిరేకత ...27
- విడాకుల పిటిషన్ పెండింగ్.. కుమార్తెకు పింఛన్ ...28
- ముచ్చటగా పెరట్లో ముత్యాలు పండిద్దాం ! ...29
- వారి జీవితాలలో పాడిపరిశ్రమతో నవోదయం! ...31
- ప్రాణ శక్తిని, పోషణ శక్తిని పెంచే ఉసిరి ! ...32
- తగిన జాగ్రత్తలతో కంటి చూపు పదిలం ! ...33

భిన్నత్వం నుంచి ఆశావహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు.

'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**


మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్స్ : 08413-403118/ 19/20, ఫాక్స్ : 08413-403117 Web: www.apmas.org, E Mail: info@apmas.org

ఎగతాళి చేయడం, వ్యంగ్యంగా మాట్లాడడం వాదనలో సత్తా లేదనడానికి రుజువులు

# 'మహిళా వ్యవసాయమంటే ప్రకృతి సంరక్షణే'

## ఏపిమాస్ నిర్వహించిన స్మరజిత్ రే స్మారకోపన్యాసంలో వక్తల విశ్లేషణ

పేదలు, బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతికోసం అహరహం తపించిన, వారి సంక్షేమంకోసం పథకాలు రూపొందించి అమలుచేసిన ఐ ఏ ఎస్ అధికారి, గొప్ప మానవతావాది, ఏపిమాస్ ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించిన కీర్తిశేషులు స్మరజిత్ రే స్మారకార్ధం ఏపిమాస్ ప్రతి ఏటా స్మారకోపన్యాసాలను, చర్చాగోష్ఠులను నిర్వహిస్తూవస్తున్నది. అందులో భాగంగా, సెప్టెంబర్ 2 వ తేదీన 'వ్యవసాయ రంగంలో మహిళలు' అనే అంశంపై స్మారక కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రసిద్ధ వ్యవసాయ పరిశోధకురాలు డాక్టర్ కల్పనా శాస్త్రి, డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డి డి ఎస్ ) సహ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ పి వి సతీష్ ప్రధాన వక్తలుగా పాల్గొన్నారు. జూమ్ ద్వారా వర్చువల్ గా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఏపిమాస్ యు ట్యూబ్ ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారంచేశారు.



స్మరజిత్ రే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించడంతో స్మారక కార్యక్రమం మొదలైంది. ఏపిమాస్ ఎండి, వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి తన స్వాగతోపన్యాసంలో వక్తలను, ఆహూతులను ఆహ్వానిస్తూ, స్మరజిత్ రే తో తనకు, ఏపిమాస్ సంస్థకు వున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఏపిమాస్ పాలకవర్గం ఛైర్మన్ శ్రీ కె. మాధవరావు పేదలపట్ల, పేదరిక నిర్మూలన కార్యక్రమాలపట్ల స్మరజిత్ రే ప్రగాఢ ఆసక్తిని, అంకితభావాన్ని తన అధ్యక్షోపన్యాసంలో వివరించారు. స్మరజిత్ రే సతీమణి నందితా రే గారు, వారి కుమారుడు అర్జిత్ రే స్మరజిత్ రే తో తమ జ్ఞాపకాలను సభ్యులతో పంచుకున్నారు. వైస్ ఛైర్ పర్సన్ మహాపర అలీ గారు , శ్రీ విజయ్ మహాజన్ క్లుప్తంగా ప్రసంగించారు. శ్రీమతి కళామణి సమన్వయకర్తగా వ్యవహరించారు.

**అంతా సహజసిద్ధం ... అదే మహిళా వ్యవసాయం**

ప్రధాన వక్తలలో ఒకరైన శ్రీ పి వి సతీష్ వ్యవసాయంపట్ల మహిళల దృక్పథం పురుషుల దృక్పథానికి పూర్తిగా భిన్నమైందని, అది ఆశావహమైన భవిష్యత్తును ఆవిష్కరించేదని అన్నారు. వ్యవసాయ మహిళలు జీవ వైవిధ్యాన్ని పరిరక్షిస్తూ, బహువిధ సాగులను సంరక్షిస్తూ, స్థానిక వంగడాలను , ఆహారపు అలవాట్లను ప్రోత్సహిస్తూ ప్రకృతిలోని అణువణువును అపురూపంగా పదిలంగా చూసుకుంటారని ఆయన కొనియాడారు. 'మహిళలకు వ్యవసాయమంటే కేవలం పంటలు పండించడమే కాదు, అది బహురూపమైనది. ఆహార భద్రతతో పాటు, పోషకాహారం, పశుగ్రాసం మొదలైనవన్నీ అందులో ఇమిడి వుంటాయి. ఎన్ని రాసులు పండించామని కాదు, ఎంత




పురోగతి సాధించగలుగుతుందని అన్నారు. వనరుల లభ్యత పురుషులకంటే మహిళలకు ఎప్పుడూ తక్కువేననే వాస్తవాన్ని ఆమె గుర్తుచేశారు. వ్యవసాయ కూలీలలో 32% మహిళలేనని, స్వయంఉపాధి పొందే కూలీలలో 48% మంది మహిళలేనని ఆమె గణాంకాలతో వివరించారు.

వాతావరణంలో వచ్చిన మార్పులు, ఉత్పాదక ప్రక్రియలలో తలెత్తుతున్న సమస్యలు, ఉపాధికోసం వలసలు వెళ్ళినవారు కరోనా కారణంగా తిరిగి స్వగ్రామాలకు చేరుకుంటుండడం మొదలైన కొత్తగా ఎదురవుతున్న ప్రతికూల పరిణామాలను ఆమె వివరిస్తూ ఈ నేపథ్యంలో మహిళలు మరింత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారని శ్రీమతి కల్పన పేర్కొన్నారు. ఆమె తన పరిశోధనలనుంచి కొన్ని కేస్ స్టడీలను ఉదాహరిస్తూ వ్యవసాయరంగంలో మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితిని వివరించారు. అందరూ మహిళలే సభ్యులుగా వున్న కొడంగల్ ఎఫ్ పి ఓ వంటి ప్రయోగాలను ఆమె ఉదాహరించారు. వాతావరణ ప్రతికూలతలను తట్టుకుని నిలవాలంటే గ్రామీణ వ్యవసాయ పరిశ్రమలు, మహిళల నేతృత్వంలో సమాజ నిర్వహణలో విత్తనోత్పత్తి కేంద్రాల ఏర్పాటు ఆవశ్యకతను ఆమె వివరించారు. వ్యవసాయ మహిళలకు ఆర్థిక సాధికారత చేకూరాలంటే వారి సామర్థ్యాలను, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ఎంతైనా అవసరమని ఆమె అన్నారు.

వ్యవసాయ రంగంలో మహిళా సాధికారత సాధనకోసం ఏపిమాస్ చేపట్టిన వివిధ కార్యక్రమాలను శ్రీమతి కళామణి వివరించారు. వ్యసాయరంగంలో మహిళలకు పురుషులతో సమాన అవకాశాలను, పరిస్థితులను కల్పించవలసిన అవసరాన్ని ఆమె పేర్కొన్నారు. శ్రీమతి కళామణి వందన సమర్పణతో స్మరజిత్ రే స్మారక కార్యక్రమం ముగిసింది. ■

నాణ్యమైన పంట పండించామనేది వారికి ముఖ్యం. ప్రకృతిసిద్ధమైన ఆహారానికే మహిళా సంఘాల సభ్యులు ప్రాధాన్యమిస్తారు. ఎందుకంటే సాగుచేసి పండించే పంటలకంటే ప్రకృతిసిద్ధమైన ఆహారంలో పోషకవిలువలు ఎక్కువనే విషయం వారికి తెలుసు' అని శ్రీ సతీష్ పేర్కొన్నారు.

స్త్రీ పురుష వివక్ష మాత్రమే కాకుండా, దళిత, అగ్రవర్ణ; గ్రామీణ, పట్టణ వంటి సామాజిక అంతరాలలో ఎక్కువ వివక్షకు గురయ్యేది మహిళలే. అయితే ప్రకృతితో వారికున్న ప్రగాఢ అనుబంధం కారణంగా వారు ఎన్నడూ నిరాశకు గురికారని శ్రీ సతీష్ వివరిస్తూ, తమ సంస్థ డి డి ఎస్ పనిచేస్తున్న గ్రామాలలోని కుటుంబాలు బయటినుంచి ఆహార పదార్థాలు తెచ్చుకోవడానికి యిష్టపడరు. వారి పొలాలలో వారు పరిరక్షిస్తున్న జీవ వైవిధ్యమే అందుకు కారణం. స్థానిక ఆహారపు అలవాట్లకు, జీవవైవిధ్యానికి, వాతావరణ మార్పులనుంచి సంరక్షణకు వారు అనుసరించే సహజసిద్ధ విధానాల కారణంగా ఈ మహిళలు ప్రతిష్ఠాత్మకమైన ఐక్యరాజ్యసమితి ఈక్వేటర్ అవార్డు పొందారని ఆయన తెలిపారు. డి డి ఎస్ సభ్యురాలైన ప్రతి మహిళ విత్తనాల సంరక్షకురాలేనని శ్రీ సతీష్ అన్నారు.

**సరికొత్త సమస్యలతో మహిళా రైతుల సతమతం**

మరొక ప్రధానవక్త శ్రీమతి కల్పనా శాస్త్రి ప్రసంగిస్తూ, వ్యవసాయ రంగంలో స్త్రీపురుష అంతరాన్ని ఎంతగా తగ్గించగలిగితే అంతగా వ్యవసాయ రంగం గణనీయమైన

# 3 జిల్లాలలో 5 రోజులపాటు సి ఎస్ బృందం పరిశీలన

- ఎన్. వినాయకరెడ్డి

అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాలలో ఏపిమాస్ నిర్వహిస్తున్న ప్రాజెక్ట్‌ల పురోగతిని పరిశీలించడంకోసం ఏపిమాస్ ఎండి, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి, ఏపిమాస్ అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్ శ్రీమతి మధుమంజరి, ఇతర సిబ్బంది



వేద్‌ప్రకాశ్ సింగ్ గారు, నీవా గారు, వరలక్ష్మి గారితో కూడిన ఏపిమాస్ బృందం సెప్టెంబర్ 7 నుంచి 11వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఈ మూడు జిల్లాలలో క్షేత్ర పర్యటన నిర్వహించారు.

ఈ పర్యటనలో భాగంగా కర్నూలు జిల్లా ఉద్యాన శాఖ ఉన్నతాధికారులతో శ్రీ సి ఎస్ రెడ్డి ఉల్లి రైతుల కష్టనష్టాలను తగ్గించడంకోసం భారీ గిడ్డంగులను అందుబాటులోకి తేవలసిన ఆవశ్యకతను వివరించారు. ఎఫ్ పి ఓల ద్వారా ఉల్లి, మిరప, టమాట విలువ గొలుసు చర్యలు చేపట్టాలని సూచించారు.

**అనంతపురం ఎం పి తో చర్చలు**

అనంతపురంజిల్లాలో తన పర్యటనలో భాగంగా శ్రీ సి ఎస్ రెడ్డి అనంతపురం ఎం పి శ్రీ తలారి రంగయ్యతో సమావేశమై ఎఫ్ పి ఓ ల నిర్వహణలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడంలో తోడ్పాటు అందించడానికి అంగీకారం తెలిపారు. గార్లదిన్నె, పెద్దవడుగూరు ఎఫ్ పి ఓల సమావేశాలలో శ్రీ సి ఎస్ రెడ్డి బృందం పాల్గొని ఎఫ్ పి ఓల వాటాదారులకు మెరుగైన సేవలను అందించే విషయమై తగిన సూచనలు చేశారు.

**వి కోట, పలమనేరు ఎఫ్ డి సి ల ప్రారంభం**

సెప్టెంబర్ 9 వ తేదీ ఉదయం చిత్తూరు జిల్లా వి.కోట రైతు సేవా కేంద్రం (ఎఫ్ డి సి) ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ సి ఎస్ రెడ్డితోపాటు శ్రీమతి మధుమంజరి, ఈ-ఫ్రెష్ ప్రతినిధి శ్రీ రాకేశ్, ఉద్యాన శాఖ అధికారి శ్రీ శ్రీనివాసులు రెడ్డి, వి .కోట మండల రైతు సమాఖ్య బోర్డు సభ్యులు, రైతులు, ఏపిమాస్ సిబ్బంది ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. రైతు సేవా కేంద్రానికి, ఈ ఫ్రెష్‌కు మధ్య కుదిరిన ఒప్పందంపై ఈ ఫ్రెష్ ప్రతినిధులు, వి కోట మండల రైతు సమాఖ్య అధ్యక్షులు సంతకాలు చేశారు.

అనంతరం శ్రీ సి ఎస్ రెడ్డి ఈ రైతు సేవా కేంద్రంలో రైతులకు కావలసిన అన్ని సేవలు (పంట సాగుకు కావలసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇంకా పశు దాణా,



వ్యవసాయ యంత్ర పరికరాలు) అందుబాటు లోకి తేవడం జరుగుతుందని చెప్పారు. తదనంతరం శ్రీ సి ఎస్ రెడ్డి, ఉద్యానశాఖ అధికారి రైతులకు ఎరువులు పంపిణీ చేశారు.

మానవజాతిని ముందుకు నడిపించేవి సైన్యాలు, ప్రభుత్వాలు కావు... కొందరు విశిష్ట వ్యక్తులే



అదే రోజు మధ్యాహ్నం పలమనేరు రైతు సేవా కేంద్రం ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ సి ఎస్ రెడ్డి, శ్రీమతి మధు మంజరి, ఈ–ఫ్రెష్ ప్రతినిధి శ్రీ రాకేశ్, ఉద్యానశాఖ ఉప సంచాలకులు, పలమనేరు మండల వ్యవసాయ శాఖ అధికారి, పలమనేరు మండల రైతు సమాఖ్య బోర్డు సభ్యులు, రైతులు ఏపిమాస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రానికి, ఈ ఫ్రెష్‌కు మధ్య కుదిరిన ఒప్పందంపై ఈ ఫ్రెష్ ప్రతినిధులు, పలమనేరు 'కౌండిన్య రైతు సమాఖ్య' అధ్యక్షులు సంతకాలు చేశారు. ఎఫ్ పి ఓ వ్యాపార సంస్థగా ఎదుగుదలకు ఎలాంటి పద్ధతులు పాటించాలో ఉద్యానశాఖ ఉప సంచాలకులు తెలియజేశారు వ్యవసాయ శాఖ కార్యక్రమాల గురించి మండల వ్యవసాయ శాఖ అధికారి బోర్డు సభ్యులకు, రైతులకు తెలిపారు. శ్రీ సి ఎస్ రెడ్డి జి ఐ సి ప్రాజెక్టులో భాగంగా ఏపిమాస్ తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను ఉద్యానశాఖ ఉప సంచాలకులకు, మండల వ్యవసాయశాఖ అధికారికి అందజేశారు.

**ప్రభుత్వ పాఠశాలలలో నిర్మాణాల పరిశీలన**

మరుసటి రోజున పీలేరులో 'అరబిందో ఫార్మా ఫౌండేషన్' సహాయంతో చేపడుతున్న 'పీలేరు రైతు సేవా కేంద్రం ప్రాజెక్ట్', పీలేరు ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టు కార్యక్రమాల అమలును శ్రీ సి ఎస్ రెడ్డి పర్యవేక్షించారు.

మొదట శ్రీ వినాయకరెడ్డి, శ్రీ నరసింహారెడ్డి తో కలసి, పీలేరు మండలం గూడరేవుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనితీరును పరిశీలించారు. తలుపులకు, కిటికీలకు నాణ్యమైన రంగులు వేయవలసిందిగా సూచించారు. గత సంవత్సరం ఏపిమాస్ ద్వారా అక్కడ చేపట్టిన బోరు బావి, చెట్ల పెంపకం మొదలగు కార్యక్రమాల నిర్వహణను పరిశీలించి సంతృప్తిని వ్యక్తపరిచారు.

తరువాత కె వి పల్లి మండలం గోరంట్లపల్లె పాఠశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న నూతన భవనాన్ని పర్యవేక్షించి, నిర్మాణ నాణ్యతపై సంతృప్తిని వ్యక్తపరిచారు. అదే ప్రాంగణంలో మరమ్మతులు చేపడుతున్న మరొక భవనాన్ని మరింత నాణ్యంగా రూపొందించడానికి కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే పాఠశాల ప్రహరీ గోడ ఎత్తు పెంచడానికి అనుమతించారు. కొంతమంది గ్రామపెద్దలతో కలసి, భవనాల సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని సూచనలిచ్చారు.

తరువాత శ్రీ సి ఎస్ రెడ్డి, శ్రీమతి మధుమంజరి పీలేరు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ కార్యాలయంలో ప్రాజెక్టు కార్యక్రమాల అమలు తీరుపై సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రైతు సమృద్ధి సేవా కేంద్రం పనితీరు బాగుందని, వ్యవసాయానికి మౌలిక పెట్టుబడుల మార్కెటింగ్



కార్యక్రమాల టర్నోవరు బాగున్నదని, పుస్తకాల నిర్వహణ బాగున్నదని, సిబ్బంది చురుకుగా ఉన్నారని అభినందించారు. మాస నివేదికలపైన, సమిష్టి అమ్మకాలపైన దృష్టి పెట్టాలని రైతు సేవా కేంద్రానికి సూచించారు.

తరువాత, పీలేరు మండలం జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన మరుగుదొడ్ల నిర్మాణ పనితీరును, పాఠశాల భవనాలకు వేసిన రంగుల నాణ్యతను పరిశీలించి సంతృప్తిని వ్యక్తపరిచారు. ■

# ఆజీవ మహిళా ఎఫ్ పి సి 3వ వార్షిక మహాసభ

– బి. శ్రీనివాస్

**ఆ**జీవ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ (ఎఫ్ పి సి) మూడవ వార్షిక మహాసభ సెప్టెంబర్ 10 వ తేదీన మర్రిగూడెం గ్రామంలో జరిగింది. ముందుగా ఆజీవ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీ కె. మహేశ్ అజీవ మహిళ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ డైరెక్టర్లను వేదిక పైకి ఆహ్వానించారు. ఆజీవ ప్రాజెక్టు ద్వారా చేపట్టిన కార్యక్రమాలను పీస్ సంస్థ




డైరక్టర్ శ్రీ కె.నిమ్మయ్య వివరించారు. తర్వాత సభ కార్యక్రమములను ఆజీవ ఎఫ్ పి సి ఛైర్‌పర్సన్ శ్రీమతి జి.ఎల్లుబాయి నిర్వహించారు. శ్రీమతి ఎల్లుబాయి మాట్లాడుతూ ఈ ఏడాది ఆజీవ కంపెనీ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఆజీవ సభ్యులకు, వాటాదారులకు విత్తనాలు, ఎరువుల సరఫరాలో, వరి ధాన్యం కొనుగోలులో ఎదురైన సమస్యలను ఆమె వివరించారు.

అనంతరం కంపెనీ డైరక్టర్ కె. స్వరూప గారు వార్షిక నివేదికను చదివి వినిపించారు. 2019 ఏప్రిల్ నుండి 2020 మార్చి 31 తేదీ వరకు అజీవ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల వివరాలను ఆమె తెలియజేశారు. ఆజీవ ఎఫ్పి సి గత ఏడాది కాలంలో దాదాపు 26 లక్షల వ్యాపారం చేపట్టినట్టు స్వరూపగారు వెల్లడించారు. ఈ సంవత్సర కాలంలో సభ్యులు పొందిన శిక్షణలు, అనుసరించిన వ్యాపార ప్రణాళికలు, ఎరువుల కొనుగోలు, రైతులకు పంపిణీ తదితర వివరాలను ఈ నివేదికలో పొందుపరిచారు. గత సంవత్సరపు ఆదాయ, వ్యయ పట్టికలను, వసూళ్ళు,చెల్లింపుల పట్టికను, ఆస్తి, అప్పుల పట్టికను చదివి వినిపించారు. సభ్యులందరూ చేతులెత్తి, చప్పట్లు చరిచి నివేదికకు తమ ఆమోదం తెలిపారు.

ఈ మహాసభలో ఏపిమాస్ నుంచి శ్రీమతి కళామణి, ఆజీవ జిల్లా కోఆర్డినేటర్ శ్రీ కిషోర్ కుమార్, శ్రీ బ్రహ్మచారి పాల్గొన్నారు.

కళామణిగారు ఆజీవ పనితీరును అభినందిస్తూ, ఇకపై ఆజీవ ఎఫ్ పి సి నే స్వయంగా వార్షిక సమావేశాలు నిర్వహించుచుకోవాలని, వచ్చే మూడేళ్ళలో 3 కోట్ల టర్నోవర్‌కు కంపెనీ చేరాలని , పేదల పట్ల మరింత సేవా దృక్పథంతో పని చేయాలని, మహిళా రైతులకు మంచి గుర్తింపు లభించేలా శ్రద్ధ వహించాలని సూచించారు.

కిశోర్‌కుమార్ గారు మాట్లాడుతూ, కంపెనీలో ప్రస్తుతం 269 మంది వాటాదారులే ఉన్నారని, ఈ సంవత్సరం చివరి నాటికి వాటాదారుల సంఖ్య 500కు చేరేలా గట్టి కృషి సాగించాలని, ఆజీవ తరఫున కందులను, చిరుధాన్యాలను ప్రాసెస్ చేసి ప్యాకింగ్‌తో, ఆజీవ బ్రాండ్‌తో మార్కెటింగ్ చేసేరోజు త్వరలో రావాలని ఆకాంక్షించారు.

బ్రహ్మచారి గారు మాట్లాడుతూ వర్షాకాలానికి ముందే ఏ గ్రామానికి ఎంత ఎరువులు అవసరమో ముందుగానే ప్రణాళిక వేసుకొన్నట్లయితే ఎరువుల, విత్తనాల వ్యాపారం సాఫీగా సాగుతుందని తెలిపారు. మహిళలు పాటించవలసిన వ్యక్తిగత పరిశుభ్రత గురించి, ఇంటింటికి మరుగు దొడ్ల అవసరాన్ని గురించి ఆయన వివరించారు.

కార్యక్రమం చివరలో కళామణి గారిని, కిశోర్‌కుమార్ గారిని, బ్రహ్మచారి గారిని పూలగుత్తుల బొకేలతో సన్మానించడం జరిగింది.

అతిథులకు, ఆజీవ బి.ఓ.డి.లకు, హాజరైన సభ్యులకు శ్రీ నిమ్మయ్య ధన్యవాదాలు తెలియజేసి సభను ముగించారు. ■

ప్రపంచం బాగాలేదని నిందించడంకాదు, ఆ బాగేదో ముందు నీలోవస్తే అంతా బాగుపడుతున్నట్టే

# ధీశాలి మహిళా ఎఫ్ పి ఓ 3వ వార్షిక మహాసభ

**– డి.హరిలాల్**

ధీశాలి మహిళా రైతు ఉత్పత్తిదారుల 3వ వార్షిక మహాసభ తిమ్మాపూర్ గ్రామంలో జరిగింది. ఈ మహాసభలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధగారు, ఏ ఈ ఐ ఎన్ ప్రతినిధి కళామణి గారు, ఏపిమాస్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కిషోర్‌కుమార్ గారు, గ్రామీణ మహిళా మండలి ప్రెసిడెంట్




విజయలక్ష్మిగారు ఎ.ఇ.ఓ హేమ గారు, నందిని గారు, బ్రహ్మచారి గారు, ధీశాలి ఛైర్ పర్సన్ పి. మంజుల గారు, ట్రెజరర్ జి. సుజాత గారు, పాలకవర్గ సభ్యులు, సి.ఈ.ఓ. హరిలాల్ గారు, 72 మంది మహిళా రైతులు పాల్గొన్నారు.

ముందుగా ధీశాలి సి.ఈ.ఓ. డి.హరిలాల్ గారు ధీశాలి మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లను వేదిక పైకి ఆహ్వానించారు. ఆజీవ ప్రాజెక్ట్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను గ్రామీణ మహిళా మండలి ప్రెసిడెంట్ డి.విజయ లక్ష్మి గారు వివరించిన తరువాత ధీశాలి మహిళా రైతు ఉత్పత్తి దారుల కంపెనీ ఛైర్ పర్సన్ శ్రీమతి పి.మంజుల గారు సభా కార్యక్రమాలను నిర్వహించారు.

శ్రీమతి పి.మంజుల గారు మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో ధీశాలి కంపెనీ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా ధీశాలి సభ్యులకు, వాటాదారులకు విత్తనాలు, ఎరువులు, టార్పాలిన్ కవర్లు, బర్రెల దాణా సమకూర్చడాన్ని గురించి, వ్యాపార సంబంధిత విషయాల గురించి ఆమె వివరించారు. వార్షిక నివేదికలో భాగంగా కంపెనీ వాటాదారుల మొత్తం, వాటా మూలధనం, కంపెనీ ఉద్దేశాలు, ఎక్స్‌పోజర్ విజిట్స్, పాలకవర్గ సభ్యుల వివరాలు, సిబ్బంది నియామకం, పాలకవర్గ సమావేశాలు–శిక్షణలు, సభ్యుల వాటాధనం పెంచుట, కంపెనీ ఫైనాన్సియల్ రిపోర్ట్ (వసూలు – చెల్లింపుల ఖాతా, ఆదాయ ఖర్చుల ఖాత, ఆస్తి అప్పుల పట్టిక), కంపెనీ భవిష్యత్తు ప్రణాళికలుతదితర విషయాల గూర్చి వివరించారు.

ధీశాలి మహిళా వాటాదారులచే, కొత్తగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులచే ధీశాలి సి.ఈ.ఓ. ప్రమాణ స్వీకారం చేయించారు. మహిళా రైతులు ఎదుర్కుంటున్న సమస్యలు, రైతు ఆత్మహత్యలు , గిట్టుబాటు లేని ధరల గూర్చి గాయకుడు డి.సతీష్ పాట రూపంలో వినిపించారు.

కళామణి గారు మాట్లాడుతూ అన్ని రంగాలలో మహిళలు ముందుంటున్నారని యుద్ధ విమానాలను కూడా ఆడవాళ్ళు నడుపుతున్నారని, ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకుని ధీశాలి మహిళా ఎఫ్ పి ఓ వచ్చే ఏడాదికి 1000 మంది వాటాదారులతో 3 కోట్ల టర్నోవర్‌కు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ఒక పండగ వాతావరణం గా ఉందని, తాము ఈ కార్యక్రమంలో భాగస్వాములైనందుకు ఆనందిస్తున్నామని ఆమె సంతోషం వ్యక్తంచేశారు.




(మిగతా 13 వ పేజీలో)

చిన్న చిన్న ఆశాభంగాలతో వచ్చే లోటేమీ లేదు... కానీ ఆశాభావం కోల్పోవడం ఇక ఎన్నటికీ తీరని లోటు

# జై కిసాన్ ఎఫ్ పి ఓ రెండవ వార్షిక మహాసభ

**అ**రోబిందో వారి ఆర్థిక సహకారంతో మహిళా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జై కిసాన్ వ్యవసాయ ఉత్పత్తిధారుల పరస్పర సహకార సంఘం 2వ వార్షిక మహాసభ జై కిసాన్ రైతు ఉత్పత్తిదారుల సంఘ చీఫ్ ప్రమోటర్ దామోదర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.



చీఫ్ ప్రమోటర్ దామోదర్‌రెడ్డి జై కిసాన్ రైతు సంఘ డైరెక్టర్స్‌ను, వ్యవసాయశాఖ మండల అధికారి శ్రీ ప్రేమరాజ్, ఏపిమాస్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శ్రీ కిషోర్ కుమార్, గంగాధర్‌లను సభ వేదిక పైకి ఆహ్వానించారు. చీఫ్ ప్రమోటర్ వార్షిక నివేదికను, ఆడిట్ నివేదికను సంఘ సభ్యులకు చదివి వినిపించటం, సభ ఆమోదించటం జరిగింది. సంఘ ఆస్తుల గురించి, పనిముట్ల గురించి సమావేశంలో చర్చించారు. సంఘ వ్యవసాయ పనిముట్లను చిన్న, సన్నకారు రైతులకు మరింత ఉపయోగ పడేలా జై కిసాన్ రైతు సంఘ డైరెక్టర్స్ బాధ్యత తీసుకొని రైతులకు మెరుగైన సేవలు అందించాలని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది.

జై కిసాన్ ఎఫ్ పి ఓ ఆధ్వర్యంలో వరి పంట కొనుగోలు కేంద్రాలను రెడ్డిఖానాపూర్, పల్పనూర్ గ్రామాలలో నెలకొల్పాలని, నిర్ణయించారు. వచ్చే సంవత్సరం కూడా ఇదే పాలక వర్గాన్ని కొనసాగిస్తూ ఆ పాలక వర్గంలోకి కొత్త గ్రామాలైన పల్పనూర్ నుండి ముగ్గురిని నస్తీపూర్ నుండి ఒక్కరిని చేర్చుకుంటూ మహాసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. గత రెండు సంవత్సరాలుగా మాధవరావ్ గారు ఆడిటర్‌గా పని చేస్తున్నారు. 2020-21లో కూడా మాధవరావు గారిని కొనసాగించాలని తీర్మానించారు.

వ్యవసాయ శాఖ మండల అధికారి ప్రేమరాజ్ గారు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగానికి పట్టుకొమ్మలు రైతుసంఘాలని, రోజురోజుకి వ్యవసాయం తగ్గిపోతున్నదని, భారతదేశ జనాభా పెరుగుతున్నదని, జనాభాకు సరిపోయే అన్నం పెట్టాలంటే రైతన్నకే సాధ్యమని కావున రైతులకు చేయూతగా రైతు సంఘాలు పనిచేయాలని అన్నారు.

సంక్షేమ పథకాల గురించి, పంటలు వేసే విధానం, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు ఎరువులు, పురుగు మందులు, ప్రత్యక్షంగా రైతులందరు కలసి తెచ్చుకోవటం వలన పెట్టుబడి ఖర్చు తగ్గి నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంటాయని, ఏపిమాస్ సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, గ్రామంలో ఎవరైతే రైతు సంఘంలో సభ్యత్వం తీసుకోలేదో వారికి వెంటనే సంఘంలో సభ్యత్వం ఇప్పించాలని కోరారు.




ఏపీమాస్ నుండి వచ్చిన శ్రీ గంగాధర్ మాట్లాడుతూ రైతులకు కావలిసిన వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను అందుబాటులో ఉంచటం ద్వారా సంఘంలో రైతుల సభ్యత్వం పెంచటానికి అవకాశం వున్నదని అన్నారు.

ఈ కార్యక్రమానికి జై కిసాన్ రైతు సంఘ పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, ఏపీమాస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ■

# ధరణి ఎఫ్.పి.ఓ ద్వితీయ వార్షిక మహాసభ

– జి.శ్రీనివాస్

**కా**మారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలానికి చెందిన ధరణి ఎఫ్.పి.ఓ ద్వితీయ వార్షిక మహాసభను 2020 సెప్టెంబర్ 21న ఒక పండుగలాగా జరుపుకున్నారు. మహాసభకు పది పంచాయతీలలోని గ్రామ రైతు సంఘాల పదాధికారులు , రైతు మిత్రలు హాజరైనారు. ఎంతో చక్కగా వారు ముందుగా తయారు చేసుకున్న ఎజెండా వారీగా చర్చించుకున్నారు. ముఖ్యంగా ఈ సంవత్సర కాలంలో చేసిన, కార్యక్రమాల వివరాలు, ఆడిట్ నివేదిక, రాబోయే సంవత్సరంలో చేపట్టదలచిన కార్యక్రమాలను సభకు తెలిపి ఆమోదం తీసుకున్నారు. స్వయం నియంత్రణ ఉద్యమ



విధానానికి అనుగుణంగా రహస్య ఓటింగ్ పద్ధతి ప్రకారం ఎలాంటి ఇబ్బంది లేకుండా చక్కగా పాలకవర్గాన్ని, పదాధికారులను ఎన్నుకున్నారు. గత సంవత్సరపు పాలకవర్గం, పదాధికారులు చేసిన సేవలను కొనియాడారు. నూతనంగా ఎంపిక అయిన వారిని అభినందించారు. వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఉత్తమ గ్రామ రైతు సంఘాన్ని ఎంపిక చేసి, వారికి అవార్డు ప్రదానం చేశారు.

ఎఫ్.డి.సి, రైతు సేవా కేంద్రం ద్వారా సభ్యులకు అందుతున్న సేవల గురించి, వివిధ వ్యాపార కార్యక్రమాలు, వరి, మక్కలు, కందులు, సోయా కొనుగోలు కేంద్రాల గురించి చర్చించారు. ఇతర సంస్థలతో అనుసంధానంలో భాగంగా ఇ ఫ్రెష్ వారితో, కోరమండల్–మనగ్రోమోర్ వారితో, అక్షయపాత్ర ఫౌండేషన్ వారితో అనుసంధానమై, కొత్త డీలర్ షిప్ తీసుకొని రైతు సంఘాల సభ్యులకు సేవలు అందించటానికి తీర్మానం చేసుకున్నారు.

తాము ఆశించిన రీతిలో ఎఫ్ పి ఓ కార్యక్రమాలను నిర్వహించడానికి వీలుగా ఉప విధులకు కొన్ని సవరణలు చేస్తూ సభ తీర్మానించింది. సమావేశానంతరం ఈ సవరణలు, తీర్మానాలను జిల్లా సహకార అధికారికి రిటర్న్ దాఖలు చేశారు.

ధరణి ఎఫ్.పి.ఓ వార్షిక మహాసభ నిర్వహణ కంటే ముందుగా స్వయం నియంత్రణ ఉద్యమం కార్యక్రమాలపైన, ఎఫ్.పి.ఓ పరిధిలోని పది గ్రామాలలో వారు ఏర్పాటు చేసుకున్న రైతు సంఘాల కార్యక్రమాలపైన ఆడిట్ నిర్వహించారు. రైతు సంఘాలలో ఎన్నికలు నిర్వహించి లీడర్ల మార్పిడి చేశారు.

గ్రామ రైతు సంఘాల ఆడిట్, ఎన్నికలు, గ్రామ రైతు సంఘాల మహాసభలు నిర్వహించారు. ముఖ్యంగా ఎఫ్.పి.ఓ వార్షిక మహాసభను సజావుగా జరపటం కోసం బోర్డు సభ్యులు నిర్వహణ కమిటీలుగా ఏర్పడి, బోర్డు, కమిటీ సభ్యులే పూర్తి బాధ్యత తీసుకొని మహాసభను విజయవంతంగా నిర్వహించటంలో ప్రధాన పాత్ర పోషించారు. స్వయం నియంత్రణ ఉద్యమ నినాదమైన 'సంఘాలు మనవే, సమాఖ్యలు మనవే, పాలనా మాదే, నియంత్రణ మాదే' అనే స్ఫూర్తికి తగినట్టుగా ఎంతో చక్కగా నిర్వహించారు.

**గొప్ప ఆకాంక్ష గొప్ప లక్షణమే... కానీ అది ఏ దారి పడుతుందో తేల్చేది వారి స్వభావమే**



## ధీశాలి మహిళా ఎఫ్ పి ఓ 3వ వార్షిక మహాసభ

(10వ పేజీ తరువాయి)

జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ గారు మాట్లాడుతూ మహిళా రైతులు ఆర్థిక ప్రగతిని సాధించాలని, ధీశాలి సంస్థ మహిళా రైతులను గుర్తించి, వారికి సాంకేతిక విజ్ఞానం అందించి, అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. మహిళలకు ఆర్థిక వనరులు సమకూర్చడంతో పాటు కూరగాయలు అమ్మడం కోసం మినీ మార్కెట్ యార్డుల స్థాపనకు చేయూత నందిస్తామన్నారు. మహిళలు అన్ని రంగాలలో అభ్యున్నతి సాధించాలన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు.

ఈ మహాసభ కార్యక్రమానికి జిల్లా సహకార అధికారి కార్యాలయం నుండి అధికారి హాజరై ఇంత చక్కగా మహాసభ నిర్వహణను చూడటం ఇదే మొదటిసారి అని శుభాకాంక్షలు తెలుపుతూ ప్రభుత్వం తరపున వారి పరిధిలో ఉన్న పనుల విషయంలో తగిన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఏపిమాస్ ప్రధాన కార్యాలయం నుండి శ్రీ శ్రీనివాస్ గారు, శ్రీ కిశోర్ కుమార్, కుమారి అయన కృష్ణ పాల్గొని, ధరణి ఎఫ్.పి.ఓ తన వార్షిక మహాసభను బోర్డు సభ్యులే స్వయంగా, ఎంతో చక్కగా నిర్వహించుకున్నందుకు అభినందనలు తెలిపారు.

సమాఖ్య వార్షిక ప్రణాళికను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ, వ్యాపారపరమైన కార్యక్రమాలు చేస్తూ, సభ్యులందరికి అవసరమైన వ్యవసాయ, వ్యాపార సేవలు అందిస్తూ ముందుకు సాగాలని సూచించారు. సభ్యులందరూ ఎఫ్.డి.సి, రైతు సేవ కేంద్రాల సేవలు వినియోగించు కోవాలని సూచించారు. ఏపిమాస్ సంస్థ ద్వారా ఇంకా కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తామని అన్నారు. ఏపిమాస్ ఫీల్డ్ సిబ్బంది శ్రీ తిరుపతి రెడ్డి, అమృతరాణి గారు మాట్లాడుతూ వ్యవసాయనికి సంబంధించిన సాంకేతిక పరమైన సేవలు అందరు వినియోగించుకొని దిగుబడిని పెంచాలని, ఎఫ్.పి.ఓ లో కొత్త సభ్యులను చేర్చుకొని, ఉన్న సభ్యులు వాటాధనం పెంచి, సంస్థ స్వంత నిధులను పెంచి కొత్త వ్యాపారాలు చేపట్టాలని సూచించారు. చివరగా ఎఫ్.పి.ఓ కార్యదర్శి వందన సమర్పణతో సమావేశం ముగిసింది. ■



కిశోర్‌కుమార్ గారు మాట్లాడుతూ విలువ జోడింపు విధానాల ద్వారా కంపెనీ ఆర్థిక ప్రగతిని సాధిస్తుందని, ప్రస్తుతం ధీశాలి మహిళా రైతు ఎఫ్ పి ఓ టర్నోవర్ 25 లక్షలు ఉందని, వివిధ వ్యాపార కార్యక్రమాల ద్వారా వచ్చే ఏడాదికి 1 కోటి టర్నోవర్ తీసుకురావాలని, బియ్యం , కూరగాయలు ఎగుమతి చేయాలని, బియ్యాన్ని, కూరగాయలను ప్రాసెస్ చేసి ప్యాకింగ్‌తో, ధీశాలి కంపెనీ బ్రాండ్‌తో మార్కెటింగ్ చేయాలని, దీనికి అన్ని సహాయ సహకారాలను ఏపిమాస్ ద్వారా అందిస్తామని చెప్పారు.

చివరగా ఈ కార్యక్రమంలో శ్రీమతి అనురాధ గారిని, కళామణి గారిని, మంజుల గారిని శాలువాలు, పూల గుత్తులతో సత్కరించారు. శ్రీమతి డి.విజయలక్ష్మి అతిథులకు, మహిళా రైతులకు, సభకు హాజరైన సభ్యులకు ధన్యవాదాలు చెప్పడంతో మహాసభ ముగిసింది. ■

సాధారణ వ్యక్తులుకూడా ఒక్కొక్కసారి అసాధారణ విజయాలు సాధిస్తారు.. కారణం పట్టు విడవకపోవడం

# చిత్తూరు జిల్లాలో ఎఫ్ పి ఓ ల వార్షిక మహాసభలు

**– ఎస్. ప్రహల్లాద**

ఏపిమాస్ ద్వారా వివిధ జిల్లాలలో ఏర్పాటు చేయబడిన రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓ లు) ప్రతి సంవత్సరం చేపట్టవలసిన చట్టబద్ధమైన వార్షిక సర్వసభ్య మహాసభ కార్యక్రమాలు 2019–20 ఆర్థిక సంవత్సరానికి గాను 2020 ఆగస్ట్, సెప్టెంబరు నెలలలో జరిగాయి. కరోనా మహమ్మారి కారణంగా మారిన పరిస్థితుల నేపథ్యంలో కొంతమంది సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని వర్చువల్ సమావేశాల ద్వారా, మరికొంతమంది కాన్ఫరెన్స్ ఫోన్‌ల ద్వారా ఈ సమావేశాలలో పాల్గొనగా, కొందరు మాత్రం నేరుగా సమావేశాలలో పాల్గొన్నారు.

**సమావేశాలు జరిగిన విధానం**

మార్చి 2020తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నుండి కార్యక్రమాలు ప్రారంభమైనాయి.



- ముందుగా సంఘాలకు ఏపిమాస్ సిబ్బంది అంతర్గత ఆడిటింగ్ చేశారు. తదుపరి చార్టర్డ్ అకౌంటెంట్‌ల ద్వారా మలివిడత ఆడిటింగ్ జరిగింది.
- ఆడిట్ నివేదికలు అందిన తరువాత సంఘాల వారీగా కార్యక్రమాల ప్రగతి నివేదికలను తయారు చేయడం జరిగింది. ప్రగతి నివేదికలలో 2019–20 ఆర్థిక సంవత్సరంలో అమలు జరిగిన కార్యక్రమాల ప్రగతి, లాభ నష్టాలతో కలిపి ఆర్థిక కార్యక్రమాల వివరాలు, 2020–21 ఆర్థిక సంవత్సరంలో చేపట్టవలసిన కార్యక్రమాల వివరాలతో ప్రగతి నివేదికలను తయారు చేయడం జరిగింది.



- వార్షిక మహాసభ తేదీని, సమయాన్ని, స్థలాన్ని సూచిస్తూ ఆయా సంస్థల అధ్యక్షుల పేరిట సభ్యులందరికి నోటీసులు పంపడం తర్వాతి కార్యక్రమం. ఈ సంవత్సరం కరోనా కారణంగా వార్షిక మహాసభ నోటీసులను సభ్యులకందరికి , అధికారులకు వాట్సాప్ ద్వారా పంపించడం జరిగింది.
- కరోనా కారణంగా ఎక్కువమంది సభ్యులు ఒకచోట చేరకుండా జాగ్రత్త వహిస్తూనే, మరొకవైపు చట్ట బద్ధంగా అవసరమైన కనీస సభ్యుల హాజరు (కోరం) కోసం ప్రయత్నించడం జరిగింది. ప్రత్యక్షంగా హాజరైనవారితో పాటు వర్చువల్ సమావేశాల ద్వారా హాజరైనవారిని లెక్కలోకి తీసుకుని కోరం నిబంధనను పాటించారు.
- ప్రతి సంఘం కూడా గత సంవత్సరం తాము చేపట్టిన కార్యక్రమాల వివరాలతో కూడిన ప్రగతి నివేదికలను మహాసభకు హాజరైన సభ్యులకు పంచిపెట్టి, తాము పారదర్శకంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలియజేయడం ద్వారా సభ్యుల విశ్వాసం పొందడానికి ప్రయత్నించాయి.

**కలికిరి ఎఫ్ పి ఓ ప్రథమ వార్షిక మహాసభ**

గతాన్ని తలచుకుని కుంగిపోతూ, గతంలోనే జీవించేవారికి ఇక వర్తమానం ఏముంటుంది ?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యానశాఖ వారి ఆర్‌కేవివై పథకంలో భాగంగా ఏపిమాస్ చిత్తూరు జిల్లా కలికిరి మండలంలో 'కలికిరి రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్' పేరుతో రైతు ఉత్పత్తిదారుల సంస్థను ఏర్పాటు చేసి 22.08.2019వ తేదీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 2020 మార్చి నెల నాటికి ముగిసిన ఆర్థిక సంవత్సరానికి మొదటి వార్షిక మహాసభను 27.08.2020వ తేదిన కలికిరి వ్యవసాయ మార్కెట్ కమిటి ప్రాంగణంలో నిర్వహించారు.

సమావేశానికి ప్రత్యక్షంగానే కోరం కన్నా అధిక సంఖ్యలో సభ్యులు హాజరు కావడం విశేషం. (కోరం 25 మంది కాగా సమావేశానికి 60 మంది హాజరు అయినారు). ప్రస్తుత కరోనా సమయంలో కూడా ఎక్కువమంది సభ్యులు హాజరు కావడం రైతులకు సంఘాల పట్ల రైతులకు వున్న మమకారం, వాటికిస్తున్న ప్రాముఖ్యతను చాటి చెబుతుంది. ఈ మహాసభకు ఉద్యానశాఖ అధికారిణి శ్రీమతి శైలజ హాజరై రైతుసంఘాల ప్రాముఖ్యతను, ప్రభుత్వం రైతుల అభివృద్ధికి చేపట్టిన వివిధ రకాల కార్యక్రమాలను వివరించారు. బైలా ప్రకారం ఎన్నికలు జరిగి నూతన కార్యవర్గ సభ్యులను, పదాధికారులను ఎంపిక చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఏపిమాస్ 'హరిత వినూత్న కేంద్రం' సంచాలకులు శ్రీ జయరాం వాట్సాప్ ద్వారా పాల్గొని సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం జరిగిన సంస్థ కార్యవర్గ సమావేశంలో ముగ్గురు పదాధికారులను ఎన్నుకున్నారు. ఈ మహాసభలో టి.చంద్రావారిపల్లి నివాసి శ్రీ పి.భాస్కర్‌రెడ్డిని అధ్యక్షులు గాను, కలికిరిరెడ్డివారిపల్లి నివాసి శ్రీ సందీప్‌రెడ్డిని కార్యదర్శిగాను, గుట్టపాలెం నివాసి శ్రీమతి అమ్ములును కోశాధికారిగాను కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కార్యవర్గ సమావేశంలో వాట్సాప్ ద్వారా పాల్గొన్న ఏపిమాస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీ సి.ఎస్.రెడ్డి కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రగతి నివేదిక ప్రతులను హాజరైన సభ్యులకు




పంచిపెట్టారు. మార్చి నెల వరకు మొత్తం 200 మంది రైతులు సభ్యులుగా చేరగా అందరి పేర్లను నివేదికలో పొందుపరిచారు. ఫలితంగా సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరు ఏఏ గ్రామాల నుండి ఎవరెవరు సభ్యులుగా వున్నారనేది చాలా శ్రద్ధగా చదవడం సంస్థ చేపట్టిన కార్యక్రమాల పారదర్శకతకు అద్దం పట్టింది. సంస్థ ప్రారంభించి కొద్దికాలమే అయినప్పటికీ మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.24,000 నికర ఆదాయం గడించడం విశేషం.




**రామసముద్రం మండలం వార్షిక మహాసభలు :**

చిత్తూరు జిల్లాలోని రామసముద్రం మండలంలో మొత్తం 14 పంచాయతీ (గ్రామ) స్థాయి , మండల స్థాయి సహకార సంఘాలు ఏర్పాటయ్యాయి. 14 గ్రామ స్థాయి సహకార సంఘాలు 6.8.2020 నుండి నెలవారీ కార్యవర్గ సమావేశాలనే వార్షిక మహాసభలుగా మార్చి సమావేశాలను పూర్తి చేశాయి. అన్ని గ్రామ సంఘాలు కూడా సభ్యులకు సమావేశ నోటీసు ఇవ్వడం, ప్రగతి నివేదికలను అందించడం,

(మిగతా 24 వ పేజీలో)

చిరునవ్వు అలవాటు కాకపోతే, నవ్వులపాలు కావడం అలవాటవుతుంది

# పాడిపశువులలో పునరుత్పత్తికి జాగ్రత్తలు !

– లిఖిత శ్రీరాం

**పా**డి పరిశ్రమలో "పునరుత్పత్తి" చాలా ముఖ్యమైన అంశం. ఉదాహరణకు ఆవు పాడి విషయం చూస్తే, ఆవు ఏటా ఒక దూడను ఈనినప్పుడు మాత్రమే పాడి పరిశ్రమ లాభదాయకంగా వుంటుంది. ఒక మందలో 'పునరుత్పత్తి', 'అధిక పాల ఉత్పాదన' అనేవి నాణానికి వున్న రెండు ముఖాలలాంటివి. ఈ రెండు అంశాలు సక్రమంగా, శాస్త్రీయంగా అమలు చేయగలిగినప్పుడు మాత్రమే పాడి పరిశ్రమ లాభదాయకంగా ఉంటుంది. ఒక పాడిపశువు జీవితకాలంలో ఈనడం అతి ముఖ్యమైన అంశం.

ఒకమారు ఈనిన తరువాత, మరల ఎదకు రావటం, గర్భధారణ చేయించడం, గర్భం నిలవటం, తర్వాత ఈనటం అనేవి ఒక పశువు ఉత్పాదక జీవితంలో ముఖ్యమైన అంశాలు. సక్రమమైన పునరుత్పత్తి మీదనే పాడి పరిశ్రమ ఆధారపడి వుంది.


ఆవు పలుమార్లు ఎదకు వచ్చి, గర్భధారణ చేయించినా గర్భం నిలుకపోవడం అతి ముఖ్యమైన సమస్య. కృత్రిమ గర్భధారణ (ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్) చేయించినా, ఆంబోతుతో జత కలిపినా ఫలదీకరణ చెందక పోవటం వలన రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. కృత్రిమ గర్భధారణ చేయటానికి డబ్బు ఖర్చుచేయడం, వైద్యానికి ఖర్చు చేయటం, వట్టిపోయిన కాలంలో పోషణ రైతులకు భారం అవుతున్నాయి.

**పలుమార్లు ఎదకు వచ్చుటకు కారణాలు**

- వంశపారంపర్య సమస్యలు (జెనెటిక్ డిసార్డర్స్)
- వాతావరణ ప్రభావం
- గర్భకోశ, తదితర వ్యాధులు

**గర్భధారణ పద్ధతులు**

- ఆవు అరవగానే వీర్యదానం చేయించరాదు. ఎద మొదలైన 12 గంటల తరువాత గర్భధారణ చేయించాలి
- ఉదయం ఎదకు వస్తే సాయంత్రం, సాయంత్రం ఎదకు వస్తే మరుసటి రోజు ఉదయం గర్భధారణ చేయించాలి. 6 గంటల తేడాతో రెండుసార్లు గర్భధారణ చేయిస్తే ఫలితాలు బాగుంటాయి
- గేదెలలో ఎదకాలం 24-36 గంటలు ఉంటుంది. ఎదలో ఉన్న గేదెకు అది ఎదకు వచ్చిన 24 గంటల తరువాత వీర్యదానం చేయించాలి. అనగా ఉదయం ఎదకు వచ్చిన గేదెకు మరుసటి రోజు సాయంత్రం చూడి కట్టించాలి



- చూలు కట్టించడం ఆలస్యం చేస్తే కట్టు నిలిచే అవకాశాలు తగ్గిపోతాయి
- సరి అయిన ఎద సమయంలో గర్భాదానం చేయిస్తే 70% పశువులకు మొదటిసారే చూడి నిలుస్తుంది
- పశువులు ఎదకు రావడానికి వాతావరణంలో తేమ, ఉష్ణోగ్రత తక్కువగా ఉన్న సమయాలు మిక్కిలి అనుకూలంగా ఉంటాయి.

**చూలు నిలవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు**

నైపుణ్యం తాను చేయగలిగింది చేస్తుంది, వివేకం తాను చేయవలసింది చేస్తుంది

1. ప్రతి పశువుకు సంబంధించిన సమాచారాన్ని రికార్డు రూపంలో వ్రాసి వుంచాలి
2. పునరుత్పత్తి సామర్థ్యం పెంచడానికి మేపు చాలా అవసరం. ఎండు గడ్డి, పచ్చిమేత, సైలేజి వంటి మేపులను అందుబాటులో ఉంచుకోవాలి
3. అంతర, బాహ్య పరాన్న జీవులను నిర్మూలించాలి
4. అధిక ఉష్ణోగ్రత, వడ గాల్పుల నుండి పశువులను సంరక్షించాలి
5. పశువును ఉదయం, సాయంత్రం పరిశీలిస్తే ఎదలో వున్నది లేనిది గమనించవచ్చు
6. మూగ యెద, బలహీనమైన సమస్య ఉన్నప్పుడు పశవులకు ప్రతి రోజూ 500 గ్రాముల మొలకెత్తిన ఉలవలు, శనగలు, గోధుమలు వంటి ధాన్యాలను 20 నుండి 30 రోజుల పాటు మేపాలి
7. గర్భకోశ వ్యాధులకు వెంటనే చికిత్స చేయించాలి. నయం కాకపోతే మందనుండి తొలగించాలి
8. విటమిన్ 'ఎ' 'డి' 'ఇ' లను ఇంజక్షన్ రూపంలో ఇవ్వాలి. ఉత్తమమైన ఖనిజ లవణ మిశ్రమాన్ని రోజుకు 50 గ్రాములు ఇవ్వాలి
9. పాలు ఎక్కువగా యివ్వాలని శెనగపిండి, నువ్వుల పిండి లాంటివి ఎక్కువ మేపుతారు. ఇందువలన పశువులు ఎక్కువ కొవ్వు పడతాయి. సక్రమంగా ఎదకు రావు. అలాంటి వాటికి వ్యాయామం కల్పిస్తే అండాశయాలు చురుగ్గా పనిచేసి ఎదకు వస్తాయి
10. పశువు ఈనటానికి 2 నెలల ముందు పాలు పితకటం ఆపేస్తే ఈనిన తరువాత ఎదకు తొందరగా వస్తుంది
11. 250 కిలోల కంటే తక్కువ బరువున్న పశువులకు, బలహీనంగా ఉన్న వాటికి, సరయిన పోషణ లేని వాటికి గర్భధారణ నిలువదు
12. చెడిపోయిన, బూజు పట్టిన ధాన్యాలను, గడ్డిని, సైలేజిని మేపకూడదు
13. నిపుణుడైన వ్యక్తితోనే కృత్రిమ గర్భధారణ చేయించాలి
14. వ్యాధులున్న ఆంబోతుతో జత కలుపరాదు. మొలుము తీగలతో రక్తము వున్నా రంగులో తేడా వున్న కృత్రిమ గర్భధారణ చేయకూడదు
15. సైక్లోమిన్ బిళ్ళలు వారానికి ఒకటి చొప్పన ఎదకు వచ్చేవరకు ఇవ్వాలి
16. జెనోవా లేదా ప్రజానా గొట్టాలు రోజుకు మూడు చొప్పున రెండు రోజులు వాడాలి
17. కోకు బిళ్ళలు రోజుకు ఒకటి చొప్పున 30-40 రోజులు ఆహారంలో కలిపి మేపాలి

ముఖ్య గమనిక:

పశువు ఈనిన తరువాత మొదటిసారి 11-17 రోజుల్లో ఎదకు వస్తాయి. కాని 30-40 రోజుల్లో ఎదకు వచ్చినప్పుడు చూడి కట్టిస్తే 90% చూడి నిలిచే అవకాశాలు ఉంటాయి.

**దూడల ఎదకు తీసుకోవలసిన జాగ్రత్తలు**

- రోజుకు అర్థ కిలో చొప్పున చిమ్మిరి (పావు కిలో నువ్వులు పావు కిలో బెల్లము) 15 రోజులు మేపాలి
- మొలక వచ్చిన శనగలు ఉలవలు, గోధుమలు రోజుకు 100 గ్రాముల చొప్పున దూడకు మేపి ఎదకు తేవచ్చు
- ప్రతి రోజూ అర్థ గ్రాము మైలుతుత్తము దాణాలో కలిపి పశువులకు మేపినచో ఎదకు రావచ్చు
- టోనోఫాస్ఫాన్, జనోవా వాడి పశువులను ఎదకు తేవచ్చు
- 1-2 ఎండు ఖర్జూరాలు, లేక 5-6 మామూలు ఖర్జూరాలు నానబెట్టి పశువులకు మేపితే పశువు ఎదకు వచ్చే అవకాశాలు మెరుగుపడతాయి
- కలబంద ఆకు మేపితే తరుపులలో పునరుత్పత్తి అవయవాలు అభివృద్ధి చెందుతాయి. పరాన్న జీవులు నశిస్తాయి. చర్మము నిగారింపు పెరుగుతుంది
- వీటితోపాటు సరి అయిన పోషణ చేసినప్పుడు మాత్రమే సంకర జాతి దూడలు 15 నెలల లోపు ఎదకు వస్తాయి.

■


# 28 ఏళ్ళుగా సేవారంగంలో వెంకటేసులు శిక్షణలు !

*అనంతపురం జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామంలో శ్రీ బండ్ల చిన్నప్ప, శ్రీమతి వెంకట లక్ష్మమ్మ దంపతులకు 1967 జులై 1 న జన్మించిన శ్రీ బండ్ల వెంకటేసులు సామాజిక శాస్త్రంలో పట్టా పొంది తను నేర్చిన విద్యకు తగిన, తనకు నచ్చిన సేవారంగంలో తన జీవన యానాన్ని సాగిస్తున్నారు. కర్నూలు నగరపాలికలోని పేదల వాడల సముదాయాల అభివృద్ధి ప్రాజెక్ట్‌లో సముదాయ సమీకర్తగా నియామకంతో 1992లో శ్రీ బండ్ల వేంకటేసులు ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. అనంతరం ఔట్రీచ్, ఐ టి డి ఏ సంస్థల ఆధ్వర్యంలో భద్రాద్రి అడవుల్లో సెక్టార్ అధికారిగా, ఐక్యరాజ్యసమితి అభివృద్ధి విభాగం (యుఎన్‌డిపి) ప్రాజెక్ట్‌లో సామాజిక సమన్వయ కర్తగా, 'జిల్లా పేదరిక నిర్మూలన కార్యక్రమం'లో సహాయ ప్రాజెక్ట్ అధికారిగా అనంతపురం జిల్లాలో సేవలందించిన శ్రీ వేంకటేసులు 2004 అక్టోబర్‌లో ఏపిమాస్ సంస్థలో సి బి ఓ గా చేరి అనేక శిక్షణలు, అధ్యయనాలు నిర్వహించారు.*

---

ఏపిమాస్‌లో సి బి ఓ గా ప్రయాణం ప్రారంభించిన శ్రీ వెంకటేసులు ప్రాజెక్ట్ మేనేజర్ స్థాయికి ఎదిగి, ప్రస్తుతం ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గా పదోన్నతి పొంది రైతు సంస్థల అభివృద్ధికి కర్నూలు జిల్లాలో సేవలందిస్తూ తన సేవారంగ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ), మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ)తోపాటు 'బీహార్ పట్టణ ప్రాంత సముదాయ అభివృద్ధి' కార్యక్రమం క్షేత్రస్థాయి సిబ్బందికి, కార్యకర్తలకు అనేక శిక్షణలు యిచ్చి, వారు తమ సామర్థ్య , నైపుణ్యాలను పెంచుకునేలా చేశారు. ఏపిమాస్ నిర్వహించిన వివిధ అధ్యయనాలలో, పరిశోధనల్లో పరిశోధకునిగా, టీమ్ లీడర్‌గా బాధ్యత వహించారు.




సంస్థలోని అన్ని స్థాయిల వారితో కలసి సానుకూల, స్నేహ దృక్పథంతో అనేక బృంద కార్యక్రమాలను విజయవంతంగా నెరవేర్చారు. సహచర బృందంలో ఎవరిలోనైనా ఇసుమంత నైపుణ్యం, పేదల సముదాయాల బాగుకోసం కష్టపడి పని చేసే తత్వం ఉంటే వారి లోపాలు సరిదిద్దుకొని ముందుకు వెళ్ళటానికి ఎంతో తోడ్పాటు నిస్తారు. వీరి సేవారంగ సేవా ప్రస్థానంలో ముఖ్య ఘట్టాలను ఒకసారి పరికికిద్దాం.

1992 సంవత్సరం నుండి 2004 సంవత్సరం వరకు (ఏపిమాస్ లో చేరకముందు) సుమారు 500 మంది కమ్యూనిటి అభివృద్ధి సిబ్బంది, మహిళా స్వయం సహాయ సంఘాల, సమాఖ్యల నాయకులకు స్వయం సహాయక సంఘాల నిర్వహణ, పుస్తక నిర్వహణ, నాయకత్వం మొదలగు అంశాలపై శిక్షణ యిచ్చారు.

♦ 2004 సంవత్సరం నుండి 2019 వరకు (ఏపిమాస్ సంస్థలో ఉన్న కాలం) డి ఆర్ డి ఏ/ వెలుగు / ఐకెపి / వై.కె.పి, మెప్మా, ఏపిమాస్ వివిధ పట్టణ, గ్రామాభివృద్ధి ప్రాజెక్టులలో ఇప్పటివరకు రెండు తెలుగు రాష్ట్రాలలో సుమారు 3000 మంది సిబ్బంది, సమాఖ్యల

*(మిగతా 20 వ పేజీలో)*

మార్చగలిగేదా మార్చు, మార్చలేదా అర్థం చేసుకో, అర్థం కాదా వదిలెయ్

# మహిళా చైతన్యానికి మారుపేరు సరోజమ్మ!

– రామసముద్రం ఏపిమాస్ బృందం


*ఆమె సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే సాహసి. తాను ముందుండి నడిపించే నాయకురాలు. శిక్షణలు పొంది, శిక్షణలు యిచ్చిన మార్గదర్శి. తాను వుంటున్న చిన్న ఊరిలో పాఠశాల విద్యారులు కంప్యూటర్ పాఠాలు నేర్చుకోవడానికి అండదండలందించిన విజ్ఞాన ప్రదాత. అటు వ్యవసాయం, ఇటు పశువుల దాణా దుకాణం నిర్వహణ సాగిస్తున్న మహిళా రైతు. రుచికరమైన వంటలతో పాఠశాలల విద్యార్థులను మెప్పించడమే కాక, ప్రముఖుల ప్రశంసలు పొందే పాకశాస్త్ర ప్రవీణురాలు. వెరసి ఆమె మహిళా చైతన్యానికి మారు పేరు! ఆమే శ్రీమతి సరోజమ్మ!*

---

"పెళ్లి అయిన కొద్ది సంవత్సరాలకే ఒంటరిని చేసి భర్త ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోగా చిన్న చిన్న బిడ్డలతో అత్తవారి ఇల్లు చేరి అక్కడ అనేక ఇబ్బందులు ఎదురైనప్పటికీ వాటిని సమర్థంగా ఎదుర్కొని తన ఇద్దరు కొడుకులను ప్రయోజకులను చేసి, ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలలో, మండలంలో ఏపిమాస్ ద్వారా చేపట్టిన అనేక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని ఆదర్శంగా నిలిచిన శ్రీమతి సరోజమ్మ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా రామసముద్రం మండలం, వనగానిపల్లి నివాసి.



వివాహానికి ముందు కర్నాటక రాష్ట్రం బెంగుళూరుకు చెందిన శ్రీమతి సరోజమ్మ అందరూ అమ్మాయిల లాగానే ఎన్నో కలలు కని రామసముద్రం మండలంలోని వనగానిపల్లి నివాసి శ్రీ వెంకటరమణా రెడ్డిని వివాహమాడి జీవితంపై ఎన్నో ఆశలతో బెంగళూరు మహా నగరంలో 1993 సం.నుండి తమ జీవన ప్రయాణం ప్రారంభించారు. శ్రీమతి సరోజమ్మ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు పుట్టారు. పిల్లల వయసు కేవలం 5 సంవత్సరాలు, 3 సంవత్సరాలు వున్న తరుణంలో శ్రీ వెంకట రమణా రెడ్డి 2001 సంవత్సరంలో ఒక ప్రమాదంలో మరణించారు. ఆ ఇద్దరు చిన్న పిల్లలతో రామసముద్రం మండలం, వనగానిపల్లిలోని అత్తగారి ఇల్లు చేరి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని స్వయం సహాయక మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరి, ఎక్కడా ఆత్మ స్థైర్యం కోల్పోకుండా తమ అత్తవారి నుండి వచ్చిన 5 ఎకరాల పొలంలో వ్యవసాయం చేయించుకుంటూ తన పిల్లలను, ఉన్నత చదువులను చదివించి, ప్రస్తుతం ఇద్దరు కొడుకులు ఉద్యోగాలలో స్థిరపడినా కూడా తాను వ్యవసాయం, పశువుల దాణా వ్యాపారం సాగిస్తూ ఆమె జీవిస్తున్నారు. వనగానిపల్లి లోని ప్రాథమిక పాఠశాలలో 13 సం.లు మధ్యాహ్న భోజన నిర్వహకురాలిగా దాదాపు 150 మంది పిల్లలకు వంటలు వండి వడ్డించారు.




**ఏపిమాస్‌తో అనుబంధం**

రామసముద్రం మండలంలో 2011 సంవత్సరంలో ఏపిమాస్ సంస్థ వాటర్ షెడ్ కార్య క్రమాల అమలు కోసం వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేసింది. వినియోగదారుల సంఘంలో సభ్యురాలుగా మొదలైన శ్రీమతి సరోజమ్మ ప్రగతి గమనం ఆమెను గ్రామ

(మిగతా 23 వ పేజీలో)

కొన్ని క్షణాల కీలక సమయంలో నీ ప్రవర్తన, జీవితకాలపు ప్రతిష్ఠ, అప్రతిష్ఠలకు మూలం కావచ్చు

# 28 ఏళ్ళుగా సేవారంగంలో వెంకటేసులు శిక్షణలు !

(18 వ పేజీ తరువాయి)

పాలకవర్గాలకు వివిధ అంశాలు (స్వయం సహాయక సంఘాలు, సమాఖ్యల ఉద్దేశం, పుస్తక నిర్వహణ, చట్టబద్దత, నాయకత్వం, శిక్షణా పద్దతులు, ట్రిగ్గరింగ్, ఓ.డి ఎఫ్) పై అనేక శిక్షణలు యిచ్చారు.

- 2019-20 సంవత్సరం కాలంలో అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాలలోని రైతు సంస్థల పాలకవర్గ సభ్యులకు సుమారు 200 మందికి రైతు సంస్థల ఉద్దేశము, చట్టబద్దత, వ్యాపారము, సమావేశాల నిర్వహణ మొదలగు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది.



- 1992 సంవత్సరం నుండి 1997 మధ్య కాలంలో కర్నూలు నగరంలోని మొదటి సముదాయ అభివృద్ధి కార్యక్రమాలు జొహరాపురం మురికివాడల వాసులతో సముదాయ అభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేయించి, వారిలో పొదుపు, స్వయం సహాయం అలవాటుకు పునాది వేశారు.
- 1997-1999 మధ్య కాలంలో ఔట్రీచ్ సంస్థ ఆధ్వర్యంలో ఐ టి డి ఏ సంస్థల తోడ్పాటుతో ఐఫాడ్ పథకంలో భాగంగా కూనవరం, చెర్ల మండలాలలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశారు.
- 1998 సంవత్సరంలో భద్రాచలం డివిజన్‌లో మొట్టమొదటి బ్యాంకు లింకేజి కార్యక్రమంగా సత్యనారాయణపురం బ్రాంచి వారిని ఒప్పించి చెర్ల మండలంలోని పెద్దిపల్లి గ్రామం స్వయంసహాయక సంఘాలకు రూ.10000లు చొప్పున మంజూరు చేయించారు.
- 1998-99 సంవత్సర కాలంలో చెర్ల మండలంలో ఔట్రీచ్ సంస్థలో శ్రీ సెబాస్టియన్ మార్గనిర్దేశంలో క్లస్టర్ సంస్థలను ఏర్పాటు చేసి, ఐ టి డి ఏ సహకారంతో సభ్యరైతుల ధాన్యం మార్కెట్ చేయడం, ఎరువులు, విత్తనాలు తక్కువ ధరలకు అందించడంమొదలైన కార్యక్రమాలను నిర్వహించారు.
- 1999 సంవత్సరం కర్నూలు జిల్లా మిడుతూరులో యు ఎన్ డి పి పేదరిక నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా మహిళా బ్యాంకు కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహించడం జరిగింది.
- 2000-2004 సంవత్సరాలలో జిల్లా పేదరిక నిర్మూలనా ప్రాజెక్ట్‌లో భాగంగా కుందుర్పి ప్రాంతంలో స్వయం సంఘాల ఏర్పాటు, మొదటి మండల సమాఖ్య ఏర్పాటు చేయడం జరిగింది. తద్వారా కోటి రూపాయలకు పైగా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగింది.
- 2002లో అనతపురం జిల్లాలోని కుందుర్పి మండలంలో సిండికేట్ బ్యాంక్ వారి సహకారంతో మొదటి బ్యాంక్ లింకేజీ చేయడానికి తోడ్పాటు ఇవ్వడం జరిగింది.
- 2002-2004 ప్రాంతంలో కుందుర్పిలోని పది గ్రామాలలో 100 కుటుంబాలకు పది పశువుల పెంపకం, పాల సేకరణ చేపట్టుటకు పాల కేంద్రాలు ఏర్పాటుకు కృషి చేయడం జరిగింది

సవాళ్ళు జీవితాన్ని ఆసక్తికరం చేస్తాయి... వాటిని అధిగమించడం జీవితాన్ని అర్థవంతం చేస్తుంది



- 2001-02 సంవత్సరంలో అనంతపురం జిల్లా కుందుర్పిలో స్థానిక యువతతో కలసి పోరాటం చేసి భూస్వాముల దగ్గర బానిసలుగా ఉన్న పిల్లలకు విముక్తి కల్పించి వారిని బాలకార్మిక పాఠశాలల్లో చేర్పించి వారి ప్రగతికి బాటలు వేయడం జరిగింది.
- 2005-09లలో ఏపిమాస్ ఆధ్వర్యంలో క్లస్టర్ ప్రాంత అభివృద్ధిలో కర్నూలు జిల్లా అరికెర తాండాను స్వయం సహాయక సంఘాల, సమాఖ్యల నిర్వహణలో ఆదర్శవంతంగా నిలపడం జరిగింది.
- 2010-13లో కడప నగరం మెప్మా-ఏపిమాస్ ఒప్పందం లో భాగంగా అక్కడ 4 పట్టణ సమాఖ్యలు ఏర్పాటు చేసి, శిక్షణలు ఇచ్చి, స్లం సమాఖ్యలను, పట్టణ సమాఖ్యలను విజయవంతంగా, ఆదాయ పథంలో, ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం జరిగింది.
- 2013-14లో ఒంగోలు నగరంలోని స్లం, పట్టణ సమాఖ్యలకు శిక్షణలతో అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వడం జరిగింది.
- 2015-17 సంవత్సరంలో బీహార్ రాష్ట్ర పట్టణ పేదల అభివృద్ధి కార్యకర్తలు, సిబ్బందికి సంబంధించి 45 పట్టణాలలో 75 మంది సిబ్బందికి శిక్షణ, అవగాహన పర్యటన కార్యక్రమాలు నిర్వహించి స్వయం సహాయక సంఘాలు, సమాఖ్యల బలోపేతానికి దోహదంచేశారు.
- 2017-19 సంవత్సరంలో తిరుపతి, ఒంగోలు, హైదరాబాద్ నగరాలలో ప్రయోగాత్మకంగా చేపట్టిన పట్టణ న్యూట్రిషన్ ప్రాజెక్ట్‌కు అవసరమైన క్షేత్ర స్థాయి సమాచారాన్ని సేకరించి కార్యక్రమాల అమలులో తోడ్పాటు నందించడం జరిగింది.
- 120 మంది వలంటీర్లతో హైదరాబాద్ మెట్రో వాటర్ అండ్ సీవరేజ్ బోర్డు వారితో 2014 నుండి 2018 వరకు కార్యక్రమాలను, నీటి నాణ్యతా పరీక్ష కార్యక్రమాలను హైదరాబాద్‌లోని సుమారు 120 బస్తీలలో విజయవంతంగా నిర్వహించారు.
- ఏపిమాస్ నిర్వహించే వివిధ అధ్యయనాల్లో టీములకు మార్గనిర్దేశనం చేసి, వాటిని విజయవంతంగా నిర్వహించారు.
- వరల్డ్ విజన్ సంస్థ సేవలందించే రంగారెడ్డి జిల్లా షాద్ నగర్, ప్రకాశం జిల్లా కందుకూరు, విజయనగరం జిల్లా గంట్యాడ ప్రాంతాలలో రెండు విడతలుగా సుమారు 200 మంది కార్యకర్తలకు టి ఓ టి ద్వారా ట్రిగ్గరింగ్ నిర్వహించి సంపూర్ణ పారిశుద్ధ్యం మీద 2017-19 సంవత్సరంలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలకు తోడ్పాటుకు క్షేత్ర స్థాయి శిక్షణ విజయవంతంగా నిర్వహించడం జరిగింది.
- కరోనా లాక్‌డౌన్ సమయంలో (2020 ఏప్రిల్,మే) ఏపిమాస్ చేపట్టిన సేవా కార్యక్రమాలలో భాగంగా హైదరాబాద్ పేదల బస్తీలలో, వాడల్లో పర్యటించి 2000 మందికి రేషన్ సామగ్రి అందజేయుటలో తోడ్పాటు ఇవ్వడం జరిగింది.
- వివిధ అంశాలపై శ్రీ వెంకటేసులు వ్రాసిన అనేక వ్యాసాలు 'మహిళా సాధికారత' పత్రికలో ప్రచురితమయ్యాయి.

**పొందిన శిక్షణలు**

కష్టాల్లో కూడా ఆనందంగా జీవించేవారు కొందరు, సకల సంపదలలో కూడా కుమిలిపోయేవారు మరికొందరు

- 1993లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో రీజనల్ సెంటర్ ఫర్ అర్బన్ ఎన్విరాన్మెంటల్ స్టడీస్, ఆధ్వర్యంలో పట్టణ మౌలిక సదుపాయాల కార్యక్రమం అమలుపై 6 రోజులు శిక్షణ పొందారు.
- 1998లో 'మేనేజ్' జాతీయ సంస్థ హైదరాబాద్‌లో వ్యవసాయంలో స్థానిక సాంకేతికత అనే అంశంపై 6 రోజులపాటు నిర్వహించిన శిక్షణ పొందారు.
- 2002 జులైలో వెలుగు, టింబక్ట్ కలెక్టివ్ సంస్థల ఆధ్వర్యంలో జెండర్‌కు సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ పొందారు.
- భాగస్వామ్య శిక్షణా విధానాలపై వెలుగు ప్రాజెక్ట్-ప్రియ సంస్థల ఆధ్వర్యంలో అక్టోబర్ 2002 చిత్తూరులో 8 రోజుల పాటు శిక్షణ పొందారు.
- విజనింగ్, లీడర్‌షిప్, కమ్యూనికేషన్ నైపుణ్యాలపై కోయంబత్తూరు కె కె ఐ డిలో ఏపిమాస్ సహకారంతో 2006 మార్చిలో 3 రోజులు శిక్షణ పొందారు
- 2010 జూన్‌లో మైక్రో ఫైనాన్స్‌పై కాలేజ్ అఫ్ అగ్రికల్చర్, పూణే వారిచే 4 రోజుల శిక్షణ పొందారు.
- 2015 మార్చి నెలలో రెండురోజుల పాటు ఏపిమాస్-కోడి ఇంటర్నేషనల్ - కెనడా రిసోర్స్ పర్సన్స్ శిక్షణ పద్ధతులపై నిర్వహించిన శిక్షణ పొందారు.
- 2016 జూన్‌లో యునిసెఫ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన 7 రోజుల శిక్షణలో సముదాయ ఆధారిత ప్రవర్తన మార్పులు అనే అంశంపై శిక్షణ పొందారు.
- 2017 ఫిబ్రవరిలో ఐసాబ్‌చే నిర్వహించిన 5 రోజుల శిక్షణలో లీడర్ షిప్ ఫర్ న్యూ ఏజ్ అనే అంశం మీద శిక్షణ పొందారు.

**సి ఎస్ రెడ్డిగారి తోడ్పాటే కారణం**

పై విధంగా ఏపిమాస్ సంస్థ తోడ్పాటుతో ఎన్నో శిక్షణలు పొంది, అనేక శిక్షణలిచ్చి, ఈ శిక్షణలతో వ్యక్తులలో, క్షేత్రస్థాయిలో చోటు చేసుకున్న మార్పులను, ఫలితాలను నేరుగా చూడటం చాలా ఆనందదాయకమని వెంకటేసులు తెలిపారు. తనకు ఇన్ని మంచి అవకాశాలు కల్పించి, తన అభివృద్ధికి ఏపిమాస్ సి ఈ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి గారు ఎంతో తోడ్పాటు అందించారని, ఆయనకు తాను ఎంతైనా కృతజ్ఞుడినని శ్రీ వెంకటేసులు ధన్యవాదాలు తెలిపారు. ■

## నల్ల మచ్చ (బ్లాక్ ఆర్మ్) తెగులు

నల్ల మచ్చ తెగులు మొక్క వివిధ దశలలో వివిధ రూపములలో కనిపిస్తుంది. మొక్క లేత దశలో ఆకులపై గుండ్రని ముదురు ఆకుపచ్చ నూనె రంగు మచ్చలు ఏర్పడి తరువాత నల్లగా మారుతాయి. ఈ తెగులు లేత మొక్కలకు ఆశించినచో అవి చనిపోతాయి. మొక్క ఎదుగుదల దశలో ఆకులపై కోణాకారంలో నూనె రంగు మచ్చలు ఏర్పడి తరువాత నల్లగా మారి, మూడవ దశలో ఆకుల ఈనెల ద్వారా తెగులు వ్యాపించి ఈనెలు నల్లగా మారుతాయి. తెగులు ఉధృతి ఎక్కువైతే ఆకులు పండి రాలిపోతాయి. తెగులు ఉధృతంగా ఉన్నప్పుడు కొమ్మలకు కూడా వ్యాపించి, కొమ్మలు నల్లగా మారి ఎండిపోతాయి. దీనినే బ్లాక్‌ఆర్మ్ అని పిలుస్తారు. పువ్వులు, కాయలకు ఈ తెగులు సోకినపుడు పరిపక్వ దశకు రాకముందే రాలిపోతాయి. కాయల మీద ముదురు ఆకుపచ్చ నూనె రంగు మచ్చలు ఏర్పడి తరువాత నల్లగా మారి గుంటలు ఏర్పడటం వలన కాయలు కుళ్ళిపోతాయి. ఈ తెగులు విత్తనముల ద్వారా వ్యాపిస్తుంది. వర్షాకాలంలో మబ్బు వాతావరణం, బలమైన గాలితో కూడిన వానలు దీని వ్యాప్తికి దోహదపడతాయి.

తెగులు సోకిన మొక్క భాగాలను తీసి నాశనం చేయాలి. పంట మార్పిడి పద్ధతిని అనుసరించడం వలన తెగులు ఉధృతిని అరికట్టవచ్చును. కిలో విత్తనానికి 10 గ్రాముల సూడోమోనాస్ ఫ్లోరసెన్స్‌తో విత్తన శుద్ధి చేయాలి. ఉధృతిని బట్టి 3-4 పర్యాయాలు 15 రోజుల వ్యవధిలో 10 లీటర్ల నీటికి స్ట్రెప్టోసైక్లిన్ లేదా పౌషామైసిన్ 1.0 గ్రా మరియు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రా. చొప్పున కలిపి పిచికారి చేయాలి. భూమిలో పొటాషియం ధాతువు లోపం లేకుండా చూసుకోవాలి. మరియు సిఫారసు మేరకు పొటాషియం ఎరువులను తప్పక వాడాలి. □

# మహిళా చైతన్యానికి మారుపేరు సరోజమ్మ!

(19 వ పేజీ తరువాయి)



రైతు సంఘం కార్యదర్శి స్థాయికి చేర్చింది.

ఏపిమాస్ తరపున పంచాయతీలో చేపట్టిన వివిధ రకాల కార్యక్రమాలలో తాను ముందుండి చురుకుగా పాల్గొని ఇతర సభ్యులకు ఆమె ఆదర్శంగా నిలిచారు. కుదురు చీమనపల్లి మైక్రోవాటర్ షెడ్‌లో ప్రవేశ కార్యక్రమాలలో భాగంగా గ్రామ వనరుల కేంద్రం ఏర్పాటుకు ఇతరులు ఎవ్వరూ ముందుకు రానపుడు తానే ముందుండి 10% నిధులను (10,000 రూపాయలు) సమకూర్చి ఈ కార్యక్రమం విజయవంతం చేసి పాఠశాల పిల్లలకు కంప్యూటర్ విద్యను పరిచయం చేయడంతో పాటు తమ ఇంటిని ఒక గ్రంధాలయం లాగా మార్చి చాలామంది పిల్లలకు విద్యాప్రదాత అయ్యారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో రామసముద్రం మండలం వాటర్‌షెడ్ ప్రవేశ కార్యక్రమాలకు మంచి పేరు వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూగర్భజలాల పెంపుదల కోసం ప్రయోగాత్మకంగా అమలు చేసిన కార్యక్రమాలలో ఇంజక్షన్ బోర్‌వెల్, చెక్ డ్యాం, చెక్ వాల్ మొదలగు కార్యక్రమాలను తానుగా అమలుచేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

**ఏపిమాస్ ద్వారా పొందిన ప్రయోజనాలు**

వాటర్ షెడ్ కార్యక్రమంలో భాగంగా రెండు ఎకరాలలో మామిడిచెట్లు, నేరేడుచెట్లు పెంచుకోవడం జరిగింది. మామిడి చెట్లనుండి గత 2 సంవత్సరాలుగా ఫలసాయం వస్తున్నది.

గ్రామ రైతు సంఘం తరపున పశువుల దాణా దుకాణం ఏర్పాటు చేసి సభ్య రైతులకు సముచిత ధరలకు దాణాను అందిస్తున్నారు. గ్రామ రైతు సంఘ సమావేశాలలోనూ, మండల స్థాయి సమావేశాలలోనూ సరోజమ్మ చురుకుగా పాల్గొంటారు.

**ఏపిమాస్ ద్వారా పొందిన శిక్షణలు**

ఏపిమాస్, జి.ఐ.జడ్ సంయుక్తంగా 2018లో గుజరాత్ లోని 'సేవా' సంస్థకు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర ప్రతినిధులతో ఏర్పాటు చేసిన క్షేత్ర సందర్శనలో రామ సముద్రం నుండి పాల్గొని అక్కడ జరిగే వివిధ రకాల కార్యక్రమాలను అధ్యయనం చేసి వాటిపై రామసముద్రం సభ్యులకు అవగాహన కలిగించారు.

ఏపిమాస్ ద్వారా ఏర్పాటు చేసిన శిక్షణలో భాగంగా తమిళనాడులోని కులుత్తలై ,చిత్తూరు జిల్లాలోని చెల్దిగానిపల్లి శ్రీ చైతన్య రైతు మిత్ర సంఘాన్ని సందర్శించి తన అవగాహనను పెంపొందించుకున్నారు. పంచాయతీ స్థాయి, మండల స్థాయిలలో ఏపిమాస్ ఏర్పాటు చేసిన వివిధ శిక్షణలకు హాజరై అభివృద్ధి కార్యక్రమాలలో మహిళల పాత్రకు నిదర్శనంగా నిలిచారు.



**రుచికరమైన వంటలు ... జర్మనీ అధికారికి వంటలో శిక్షణ**

రామసముద్రం మండలంలో భాగంగా ఏపిమాస్ నిర్వహిస్తున్న జి.ఐ.జడ్ ప్రాజెక్టుల సందర్శన కోసం వచ్చే వివిధ స్థాయి అధికారులకు, ప్రముఖులకు తాను స్వయంగా భోజనం వండి వడ్డించి చిత్తూరు జిల్లా వంటకాలను రుచి చూపించేవారు. ఏపిమాస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ సి.ఎస్.రెడ్డి, శ్రీమతి కళామణి, శ్రీ మధుమూర్తి, ప్రాజెక్టు పర్యవేక్షణ కోసం జర్మనీ నుంచి, కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన చాలామందికి శ్రీమతి సరోజమ్మ తమ వంటలను రుచి చూపించడం జరిగింది. 2019లో జి.ఐ.జడ్ ఇండియా



సంచాలకులు శ్రీ యోనా బదిలీపై జర్మనీకి వెళ్ళేటప్పుడు సరోజమ్మ ఇంటివద్ద ఒక రోజు వంట నేర్చుకొని వెళ్ళారు.

**ఏపిమాస్ ఎందరికో మార్గదర్శి**

రామసముద్రం మండలంలో 2011 నుండి ఏపిమాస్ సంస్థ ఒంటరి మహిళల, రైతుల అభివృద్ధికి చేపట్టిన అనేక కార్యక్రమాల వలన చాలామంది రైతులు బాగు పడ్డారని అందులో తాను ఆర్థికంగా అభివృద్ధి చెందానని, ఎందరికో మార్గదర్శిగా నిలిచిన ఏపిమాస్ సంస్థకు ముఖ్యంగా సంస్థ ముఖ్య కార్య నిర్వహణాధికారి శ్రీ సి.ఎస్.రెడ్డి గారికి తాను ఎంతైనా కృతజ్ఞురాలిగా వుంటానని ఆమె తెలియజేశారు. ■

# చిత్తూరు జిల్లాలో ఎఫ్ పి ఓ ల వార్షిక మహాసభలు

*(15 వ పేజీ తరువాయి)*



గ్రామ రైతు సంఘాల వారీగా లాభ నష్టాలను పరిశీలించగా స్థూలంగా అన్ని సంఘాలు లాభాలలో వుండగా 2019-20వ ఆర్థిక సంవత్సరంలో చెంబకూరు గ్రామ సంఘం రూ.1000, రామసముద్రం గ్రామసంఘం రూ.9000 నష్టాలలో వున్నవి. రామసముద్రం మండల ఎఫ్.పి.ఓ రూ.110,000 లాభంలో వున్నది.

ప్రతి సంఘం కూడా తమ లాభాలను సంఘ నిధిలో వుంచి సంస్థలు చేపట్టే వివిధ రకాల వ్యాపార కార్యక్రమాలకు పెట్టుబడిగా వినియోగించాలని తీర్మానించాయి. మండల స్థాయిలో జరిగిన ఎఫ్.పి.ఓ సమావేశాలలో పదవి నుండి వైదొలగిన వారిని నూతనంగా ఎన్నికైన వారు సన్మానించారు.

కలికిరి, రామసముద్రం మండలాలలో ఏపిమాస్ ద్వారా ఏర్పాటు చేసిన సహకార సంఘాలకు నిర్ణీత ఫీజు చెల్లించి వార్షిక రిటర్న్‌లను చిత్తూరులోని జిల్లా సహకారశాఖ అధికారికి సమర్పించారు.

కరోనా మహమ్మారి సమయంలో కూడా సభ్యులు సమావేశాలు జరిపి సంఘాలపై తమకున్న నమ్మకాన్ని ప్రదర్శించడం భవిష్యత్‌లో సంఘాల సుస్థిరతకు ఒక సూచికగా చెప్పవచ్చు. ■

ఎన్నికలు మొదలగు కార్యక్రమాలను క్రమపద్ధతిలో నిర్వహించాయి. గ్రామ సంఘాలు వాటి వీలునుబట్టి వివిధ పద్ధతుల (నామినేషన్, చిట్టీలు) ద్వారా ఎన్నికలు నిర్వహించుకున్నారు

చివరిగా మండల స్థాయి రామసముద్రం ఎఫ్.పి.ఓ వార్షిక మహాసభ 28.08.2020వ తేదీన జనార్ధనస్వామి గుడి ప్రాంగణంలో జరిగింది. ఈ సమావేశానికి మదనపల్లి ఉద్యానశాఖ అధికారి శ్రీమతి ఉమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపిమాస్ హరిత వినూత్న కేంద్ర సంచాలకులు శ్రీ జయరాం వర్చువల్‌గా పాల్గొని, సంస్థ సుస్థిరత కోసం సలహాలు , సూచనలు అందించారు.

ఆశయం ఎంత గొప్పదైనా, సోమరితనం అడుగు ముందుకు వేయనివ్వదు సాకులు వెదికి చతికిలపడ వేస్తుంది

# పాడిపశువులలో లంపి చర్మ వ్యాధి వ్యాప్తి

– లిఖిత శ్రీరాం

**ఈ** మధ్య కాలంలో మన రాష్ట్రంలో లంపి చర్మ వ్యాధి పశు పోషకులను ఆర్థికంగా ఎక్కువ నష్టపెడుతున్నది. ఈ వ్యాధిని 'లంపీ స్కిన్ డిసీజ్ ' (ఎల్ ఎస్ డి) అని పిలుస్తారు. ఈ వ్యాధిని మొదట జాంబియా దేశంలో 1929లో కనుగొన్నారు. తర్వాత యితర ఆఫ్రికా దేశాలకు వ్యాపించి, ఇప్పుడు ప్రపంచమంతా ప్రబలింది.

మన దేశంలో కూడా దాదాపు అన్ని రాష్ట్రాలలో వుంది. మన రాష్ట్రంలో మొదట విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కనుగొన్నారు. పొరుగు రాష్ట్రమైన ఒరిస్సా నుండి వ్యాపించింది.

**వ్యాధి లక్షణాలు**

- జ్వరం 105 డిగ్రీల ఫారన్‌హీట్ ఉంటుంది.
- శరీరం మొత్తం తలనుండి తోక వరకు రూపాయి పరిమాణంలో బొడిపెలు ఏర్పడతాయి.
- బొడిపెల మధ్యలో నలుపు రంగు వస్తుంది.
- కొన్ని రోజులకు బొడిపెలు పుండ్లుగా మారతాయి.
- తరువాత బొడిపెల పైన చర్మం ఎండిపోయి రాలిపోతుంది.
- ఆ ప్రదేశంలో ఈగలు గ్రుడ్లు పెట్టి, పురుగులు (మాగెట్స్) గా తయారై అక్కడి మాంసాన్ని తింటాయి.
- కాలి గిట్టలకు వ్యాపిస్తే కొన్నిమార్లు గిట్టలు రాలి పోతాయి.
- ఈ వ్యాధి కాలంలో పశువు చాలా చికాగుగా వుంటుంది.
- విపరీతమైన నొప్పి, దురద వుంటుంది.
- సకాలంలో వైద్యం అందనట్లయితే కళ్ళ కలక వచ్చి కళ్ళ నుండి నీరు పుసులు వస్తాయి.
- జలుబు చేస్తుంది. ఒక్కోసారి వ్యాధి తీవ్రమైతే నిమోనియా సోకవచ్చు.
- నోటిలో పుండ్లు ఏర్పడి మేత మేయలేవు.
- ఉదరకోశం, శ్వాసకోశం, జననేంద్రియ భాగాలు కూడా దెబ్బతినే అవకాశముంది.
- వ్యాధి ముదిరితే పశువు క్షీణించి చనిపోయే అవకాశముంది.

**వ్యాధి కలగడానికి కారణాలు**

ఈ వ్యాధి "లంపీ స్కిన్ డిసీస్ వైరస్" (ఎల్ఎస్‌డివి) అనే వైరస్ వలన సోకుతుంది. గొర్రెలు, మేకలకు వచ్చే మశూచి వ్యాధిని పోలి వుంటుంది. కాని గొర్రెలకు, మేకలకు ఈ లంపీ వ్యాధి రాదు. పశువులకు, గేదెలకు మాత్రమే వస్తుంది. పశవులనుండి మనుష్యులకు వ్యాప్తి చెందదు. ఈ వ్యాధి వలన పశువుల మరణాల సంఖ్య 5 శాతం మించదు. కాని కోలుకోలేని దెబ్బ తీస్తుంది. పాల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. చూడి పశువులలో గర్భస్రావం జరుగుతుంది. తొందరగా ఎదకు రావు. సక్రమంగా చూడి నిలువదు. దేశవాళీ పశువులకన్నా సంకరజాతి పశువులు తొందరగా ఈవ్యాధి బారిన పడతాయి.

**వ్యాప్తి చెందే విధానం**

పేలు, ఈగలు, దోమలు, జోరీగల వలన వ్యాధి వ్యాప్తి చెందుతుంది. జబ్బున పడిన పశువులను కుట్టి ఆ తరువాత ఆరోగ్యమైన పశువును కుడితే ఆ పశువులకు వ్యాధి వస్తుంది. అనారోగ్యం పాలైన పశువులకు చికిత్స చేసి అదే సిరంజి, సూది యితర పశువులకు వాడితే వాటన్నిటికీ జబ్బు వచ్చే ప్రమాదం వుంది. కలుషితమైన నీరు, గ్రాసమూ, దాణా ద్వారా కూడా వ్యాపిస్తుంది.

**చికిత్స**

వైరస్ వలన వ్యాధి వస్తుంది కాబట్టి కచ్చితమైన వైద్యం లేదు. లక్షణాలను అనుసరించి వైద్యం చేయాలి. జ్వరం, నొప్పి, దురద, యితర లక్షణాలకు వైద్యం చేయాలి.

**సాధించింది ఎంత గొప్పదైనా కావచ్చు, మరెంతో గొప్పది మిగిలే వుంటుంది.. అదే జీవితంలో వుండే మజా!**

- జ్వరం, నొప్పికి పారాసిట్‌మాల్, మెలాక్సీకామ్ (paracetamol, melaxicom) లాంటి మందులు వాడాలి లేదా పై రెండు మందులు కలిపిన మెలోనెక్స్ ప్లస్ మందులు వాడాలి.

2. దురద తగ్గడానికి - యాంటిస్టామైన్ (Antihistamine) మందులు, జీట్, అవిల్ (jeet, avil) లాంటివి వాడాలి. స్టెరాయిడ్స్ వాడకూడదు.
3. జ్వరం తగ్గకపోతే పశువు శరీరం మీద చల్లటి నీటిని పిచికారి చేయాలి.
4. వ్యాధి తీవ్రతను అనుసరించి యాంటీబయాటిక్స్ వాడాలి.
5. వ్యాధి తీవ్రత తక్కువగా వుంటే స్ట్రెప్టోపెన్సిలిన్, (streptopenicillin) ఎక్కువగా వుంటే సిఫ్టోఫోర్ (ceftiofur) లాంటి మందులు వాడాలి.
6. శరీరం పైన యేర్పడిన పుళ్ళకు లొరేక్సేన్, చార్మిల్ (lorexane, charmil) లాంటి మలాములు వాడాలి.
7. పుళ్ళలో పురుగులు (మాగాట్స్) వుంటే టాపికర్ (topicur) లేదా డీమాగ్ (dmag) లాంటి మందులు వాడాలి.
8. వీటితోపాటు మల్టీవిటమిన్ సిరప్‌లు వాడాలి.
9. మేత మేయకపోతే తేలికగా జీర్ణమయ్యే జావను ఉప్పు, బెల్లంతో కలిపి రోజుకు 2 బక్కెట్లు త్రాగించాలి.

ఇదే ఖచ్చితైన వైద్యం కాదు. లక్షణాలను బట్టి మందులు మార్చాలి. ఏ చికిత్స అయినా పశువైద్యుని పర్యవేక్షణలోనే జరగాలి.

**నివారణ**

ఈ వ్యాధికి టీకాలు మన దేశంలో అందుబాటులో లేవు. కాని కొందరి అనుభవం ప్రకారం గోట్ పాక్స్ వ్యాక్సిన్ కొంతవరకు పనిచేయవచ్చు.

వ్యాధిసోకిన పశువులను వేరుచేయాలి. శరీరంపై ఈగలు దోమలు వాలకుండా బటక్స్ లాంటి మందులు 3,4 రోజులకొక మారు పిచికారీ చేయాలి. కొట్టంలో, పరిసరాలలో కూడా మందును పిచికారీ చేయాలి. పరిసరాలు శుభ్రంగా ఉంచాలి. దోమలు, ఈగలు రాకుండా చూడాలి. పెంటకుప్పలు, నీటి గుంటలు వెంటనే తొలగించి ఫినైల్, ఫార్మాలిన్, బ్లీచింగ్ పౌడర్ లాంటి మందులను పిచికారీ చేయాలి. కొట్టాన్ని రోజుకు రెండుమార్లు శుభ్రం చేయాలి. ■

## పాలు - తేనేతో మంచి నిద్ర

ఎంత బలవర్ధక ఆహారం తీసుకున్నా.. వాకింగ్‌లు, జాగింగ్‌లు, వ్యాయామాలు చేసినా నిద్ర లేకపోతే ప్రయోజనం శూన్యం. ఎందుకంటే నిద్రలేమి వల్ల సమస్త జీవక్రియలు కుంటుపడతాయి. ఫలితంగా ఎంతటి పోషకాహారం తీసుకున్నా వాటిల్లోని పోషక పదార్థాలను గ్రహించే స్థితిలో ధాతు వ్యవస్థ ఉండదు.

ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే జీర్ణక్రియతో పాటు విసర్జన క్రియ కూడా మందగిస్తుంది. ఫలితంగా శరీరం నిండా వ్యర్థ పదార్థాలు పేరుకుపోయి శరీరంలో ఆక్సిజన్ నిల్వలు తగ్గిపోతాయి. ఈ క్రమంలో రక్తప్రసరణలో అంతరాయం ఏర్పడుతుంది. వీటన్నింటికీ నిద్రలేమే కారణం. ఈ సమస్య ఎక్కువ కాలం కొనసాగితే, గ్రహణ శక్తి, జ్ఞాపకశక్తి కూడా తగ్గిపోతాయి. నీరసం, నిస్సత్తువ ఆవరించి వృత్తిపరమైన సామర్థ్యం తగ్గిపోతుంది. ఈ సమస్య నుంచి బయటపడడానికి నిద్ర మాత్రలు వేసుకోవ డానికి సిద్ధపడితే అదొక వ్యసనంగా పరిణమించవచ్చు. అలా రోజూ ఆ మాత్రలు వేసుకోవాల్సిన స్థితి ఏర్పడితే, ఏ ఒక్కరోజు ఆ మాత్ర వేసుకోకపోయినా అసలే నిద్ర రాకపోవచ్చు.

అందువల్ల పౌష్టికాహారం, వ్యాయామాలకు ప్రాధాన్యతనిస్తూనే, రోజూ నిద్రకు ఉపక్రమించే ముందు గ్లాసుడు పాలలో రెండు టేబుల్ స్పూన్ల తేనె కలుపుకుని తాగాలి. ఇలా చేస్తే హాయిగా నిద్ర పడుతుంది. దీనివల్ల ఎలాంటి దుష్ప్రభావాలూ తలెత్తవు. □

# బాలికల వివాహ వయస్సు పెంపు యోచనపై తీవ్ర వ్యతిరేకత

ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ 2020 ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రసంగిస్తూ తమ ప్రభుత్వం బాలికల వివాహ కనీస వయస్సును 18 నుండి 21 సంవత్సరాలకు పెంచాలని ఆలోచిస్తున్నట్లుగా ప్రకటించారు. (ప్రస్తుతం ఈ వయస్సు అమ్మాయిలకు, 18 సంవత్సరాలు అబ్బాయిలకు 21 సంవత్సరాలుగా ఉంది). "ఆడపిల్లలు ఇక ఏమాత్రం పోషణ లోపంతో బాధపడ కూడదు. సరియైన వయస్సులో వివాహం జరిగేలా చూడడానికి ఒక కమిటీని



ఏర్పాటు చేశాం. ఈ కమిటీ తమ నివేదికను సమర్పించిన వెంటనే ఆడపిల్లల వివాహ వయస్సుపై ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకుంటుంది" అని ప్రధానమంత్రి చెప్పారు. ఈ అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ 2020 జూన్ 4 నుండి సాగిస్తున్న చర్చల గురించి కూడా ప్రధాని తన ప్రసంగంలో ప్రస్తావించారు.

ఇది తొందరపాటు ఆలోచనగా కౌమార, యుక్త వయస్సు వ్యక్తుల హక్కులు, బాలల హక్కులు, మహిళల హక్కుల అధ్యయనంలో, సలహా సంప్రతింపులలో విస్తృత అవగాహన, విశేష అనుభవం ఉన్న ప్రజా సంస్థలు, వ్యక్తులు పేర్కొంటున్నారు. బాలికల వివాహ కనీస వయస్సును పెంచాలన్న ప్రభుత్వ ఆలోచనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రజా సంఘాలు (సివిఎస్ఓలు), వ్యక్తులు సంఘటితమై బాలికల చట్టపరమైన వివాహ కనీస వయస్సును పెంచాలన్న తొందరపాటు ఆలోచనను ప్రశ్నించాల్సిన అవసరాన్ని టాస్క్‌ఫోర్స్‌కి తెలియచేశారు. బాలికల వివాహ కనీస వయస్సును పెంచాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని వ్యతిరేకిస్తున్న దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతులు కూడా టాస్క్‌ఫోర్స్‌తో మాట్లాడారు.

బలవంతంగా చట్టాన్ని సవరించడం ద్వారా లైంగిక సమానత్వాన్ని పెంచలేమని, మహిళల హక్కులను, బాలికల సాధికారతను పెంపొందించలేమని, వివాహ కనీస వయస్సు పెంపువల్ల తల్లులు,శిశువుల ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికికూడా పెద్దగా చేయగలిగేది ఏమీ వుండదన్నది వీరి నిశ్చితాభిప్రాయం.

**చట్టం ఎందుకు ఒక సమాధానం కాదు ?**

బాల్య వివాహాలు ఒక వాస్తవం. ఐతే గత కొన్ని దశాబ్దాలలో 18 సంవత్సరాలలోపు వివాహం చేసుకుంటున్న బాలికల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నది గుర్తించడం అవసరం. ఇదే ధోరణి రాబోయే కాలంలో కూడా కొనసాగు తుందనడానికి నిదర్శనాలు కనిపిస్తున్నాయి. మన దేశంలో కుటుంబ ఆరోగ్యంపై 2015-16 లో నిర్వహించిన జాతీయస్థాయి సర్వే (ఎన్ఇహెచ్ఎస్-4) ప్రకారం అప్పటికి 20-24 సంవత్సరాల వయస్సులోని మహిళల్లో 26% మంది 18 సంవత్సరాల లోపు వివాహం చేసుకోగా, దాదాపు 56% మంది 21 సంవత్సరాలలోపు పెళ్ళి చేసుకున్నారు. నిజానికి ఈ గణాంకాలు కూడా వాస్తవానికన్నా తక్కువే.

ఒకవైపు ఎందరో మహిళలకు వైవాహిక హోదాను, హక్కులను నిరాకరిస్తూ, పేదరికం కారణంగానే వారు బలవంతపు వివాహాలు చేసుకుంటున్నారన్న వాస్తవాన్ని

విస్మరిస్తూ, మరోవైపు కనీస వివాహ వయస్సును పెంచడమే పురోగతి ఎలా అవుతుంది? జీవన అవసరాలు, అభద్రత కారణంగా బాల కార్మికులుగా పిల్లలను పనులలోకి పంపే గత్యంతరం లేని పరిస్థితిని ఎదుర్కొంటున్న కుటుంబాలను చిన్న వయసులో వివాహం చేస్తున్నారంటూ దోషులుగా చూడడం ఎంతవరకు సబబు ?

ప్రపంచవ్యాప్తంగా స్త్రీ పురుషులిద్దరికీ కనీస వివాహ వయస్సు 18 సంవత్సరాలుగా ఉంది. 1992లో భారతదేశం కూడా సంతకం చేసిన అంతర్జాతీయ బాలల హక్కుల ప్రతిపాదన ప్రకారం బాలుడు లేదా బాలిక అంటే 18 సంవత్సరాల వయస్సు వరకు అని నిర్వచించింది. స్త్రీ పురుషుల కనీస వివాహ వయస్సు 21 సంవత్సరాలు ఉండడం అనేది లైంగిక సమానత్వానికి నిదర్శనం అనుకోవడం కేవలం అపోహ మాత్రమే.

వయసు విషయంలో చట్టపరమైన సమానత్వాన్ని తు.చ తప్పకుండా అమలు చేయాలనుకుంటే ప్రపంచంలోని అత్యధిక దేశాలలో ఉన్నట్లుగా స్త్రీ పురుషులిద్దరి వివాహ వయసును 18 సంవత్సరాలుగా చేయడమనేది పరిశీలించదగ్గ విషయం.

ఎదిగిన ఆడపిల్లలు బడి మానివేయడం, వారికి సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం బాల్య వివాహాలకు ముఖ్య కారణాలు అవుతున్నాయనడానికి కావలసినన్ని నిదర్శనాలు మన ముందు ఉన్నాయి. అంతేకాని బడి మానేయడానికి బాల్య వివాహాలే కారణం కానేకాదు.

అనేక అధ్యయనాల ప్రకారం మన విద్యా వ్యవస్థ వైఫల్యాలు, లోపాలు యువత (ఆడ, మగ పిల్లలు కూడా) చదువు మానేసేలా చేస్తున్నాయి. చిన్న వయసులో వివాహాలు అధిక సంతానానికి కారణం ఏమాత్రం కాదు. నిజానికి దేశంలోని అనేక రాష్ట్రాలలో సంతానోత్పత్తి శాతం కనిష్ట స్థాయికి పడిపోయింది. చిన్న వయసులో పెళ్ళిళ్ళు ఎక్కువగా జరుగుతున్న రాష్ట్రాలలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. తల్లులు, నవజాత శిశువులలో అనారోగ్య సమస్యలకు మూల కారణం పేదరికమే కాని చిన్న వయసులో వివాహాలు కానేకాదు.

■

## విడాకుల పిటిషన్ పెండింగ్‌లో వున్నా కుమార్తెకు పింఛన్

**కు**టుంబ పింఛన్ నియమనిబంధనల్లో కేంద్రం స్వల్ప మార్పు చేసింది. దీని ప్రకారం తల్లిదండ్రులు బతికున్న కాలంలో విడాకుల కోసం కుమార్తె దాఖలు చేసిన పిటిషన్ పెండింగులో ఉన్నప్పటికీ వారికి కూడా ఇకపై తల్లిదండ్రుల పింఛన్ లభించనుంది. ఈ మేరకు కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. ఇప్పటి వరకు తల్లిదండ్రులు జీవించి ఉన్న కాలంలో అధికారికంగా విడాకులు పొందిన కుమార్తెలు మాత్రమే ఉద్యోగి / పింఛన్ లబ్ధిదారు అయిన తల్లిదండ్రుల పింఛన్ పొందేందుకు అర్హులు. ఇప్పుడు ఈ నిబంధనను సవరించి విడాకులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వారు కూడా పెన్షన్‌కు అర్హులేనని మంత్రి తెలిపారు.

విడాకులు అధికారికంగా మంజూరు కాకున్నా పెన్షన్ లబ్ధిదారులైన తల్లిదండ్రులు బతికున్న కాలంలో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేసి ఉంటే సరిపోతుందని మంత్రి వివరించారు. తల్లిదండ్రుల మరణానికి ముందు దివ్యాంగులైన పిల్లలు.. తల్లిదండ్రుల మరణం తర్వాత దివ్యాంగ ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే వారికి కుటుంబ పెన్షన్ లభిస్తుందన్నారు. అయితే, తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత మాత్రం వైకల్యం ప్రాప్తిస్తే మాత్రం ఇది వర్తించదన్నారు. కాగా, దివ్యాంగ పెన్షనర్ల సహాయకులకు ఇచ్చే అటెండెంట్ అలవెన్సును రూ. 4500 నుంచి రూ. 6700కు పెంచినట్టు జితేంద్రసింగ్ తెలిపారు. □

కొన్ని లోపాలు, కొందరికి అసౌకర్యాలు లేకుండా ఏ మార్పూ వుండదు.. అది మంచికోసం జరిగే మార్పయినా సరే...

# ముచ్చటగా పెరట్లో ముత్యాలు పండిద్దాం !

ప్రొఫెసర్ మతాచన్ చిత్రమైన మనిషి. ఆయన ప్రత్యేకత ఏమిటంటే... తన మనసుకు నచ్చిన పనే చేస్తాడు. ఎవరేమనుకున్నా పట్టించుకోడు. కేరళలో పుట్టి పెరిగాడు.



ఫిషరీస్ మీద ఆసక్తి ఉంది. అయితే, టెలికాం ఇంజనీరింగ్ చదువుకోవడం వల్ల ప్రొఫెసర్ అయ్యాడు. సౌదీ అరేబియా లోని కింగ్ ఫహ్ద్ పెట్రోలియం-మినరల్స్ యూనివర్సిటీలో టెలికమ్యూనికేషన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా కొన్నేళ్లు ఉద్యోగం చేశాడు. ఆ కాలంలోనే ఓ సౌదీ చమురు కంపెనీ అధికారులతోపాటు దుబాసీగా చైనాలో పర్యటించాల్సి వచ్చింది. ఆ పర్యటన అనుకోకుండా అతని ఆత్మను తట్టి లేపింది. వృత్తినే మార్చేసింది. చైనా వుక్సిలో గల దాన్‌షూయి మత్స్య పరిశోధనా స్థానాన్ని ఆయన సందర్శించాడు. అక్కడ కంటపడిన ముత్యాల సాగు మీద మనసు పారేసుకున్నాడు. వెళ్లిన పని చూసుకొని తిరిగి సౌదీ చేరుకున్న ప్రొఫెసర్ మతాచన్ మనసు మనసులో లేదు. ముత్యాల సాగే మనసంతా నిండిపోయి ఉంది. కొద్ది వారాల్లోనే ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి చైనా వెళ్లి ముత్యాల పెంపకం నేర్చుకున్నాడు.


**పెరట్లోనే బక్కెట్లలో..**

ఆర్నెల్ల తర్వాత 1999లో కేరళలోని ఇంటికి చేరుకొని పెరట్లోనే పని ప్రారంభించాడు. ఆవిధంగా ప్రొఫెసర్ మతాచన్ కాస్తా... ముత్యాల రైతు మతాచన్‌గా మారిపోయాడు. నదుల్లో దొరికే ఆల్చిప్పలను తెచ్చి పెంచాడు. 18 నెలల్లో 50 బక్కెట్లలో పెంచిన ముత్యాలను రూ. 4.5 లక్షలకు అమ్మాడు. రూ. 3 లక్షలు లాభం వచ్చింది. 21 ఏళ్లుగా తన ఇంటి మడుగులోని బక్కెట్లలో ముత్యాలు పెంచుతూ ఉన్నాడు. పేరుకు పేరు, డబ్బుకు డబ్బూ సంపాదిస్తున్నాడు. 'నేను ఉద్యోగం మానేసి నప్పుడు అందరూ తిట్టిపోశారు. అయినా నేను పట్టించుకోలేదు. ముత్యాల పెంపకం గురించి అప్పట్లో పెద్దగా ఎవరికీ తెలీదు. కానీ, నాకు మాత్రం గట్టి నమ్మకమే. ఉద్యోగంలోనే ఉంటే మా వూళ్లో అందరిలో ఒకడిగానే ఉండే వాడిని. ఇప్పుడు నాకు డబ్బుతో పాటు ప్రతిష్ట కూడా పెరిగింది' అంటున్నాడు మతాచన్ సంతృప్తిగా.

**18 నెలల పంట**

ముత్యాల సాగు జపాన్‌లో ప్రారంభమైంది. ముత్యాలు మూడు రకాలు. కృత్రిమంగా తయారు చేసేవి, నదులు, సరస్సుల్లో ఆల్చిప్పల్లో సహజంగా పెరిగేవి, పెంచేవి. సాగైన ముత్యాలకు విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. నదులు, సరస్సుల నుంచి తెచ్చిన ఆల్చిప్పల లోపలికి గుండ్రటి న్యూక్లియస్‌ను చొప్పిస్తారు. ఇది కొంచెం నైపుణ్యం అవసరమయ్యే పని. అలా చొప్పించిన న్యూక్లియస్ చుట్టూ కాల్షియం 540 పొరలు పేరుకుంటాయి. ఆ క్రమంలోనే చక్కని ముత్యం





తాను సమకూర్చుతానని ఆయన 'సాక్షి'తో చెప్పారు.

శిక్షణ పొందగోరేవారు రూ. పది వేలు సర్వీస్ చార్జి చెల్లించాల్సి ఉంటుందని మతాచన్ (94460 89736)అన్నారు.ఆయన 21ఏళ్లుగా నడుస్తున్న ఈ సరికొత్త సాగుబాట ఇప్పటికీ మేలిమి ముత్యమే! https://genuinepearl13.weebly.com

మంచినీటిలో ముత్యాల పెంపకంపై ఒడిశాలోని భువనేశ్వర్ సమీపంలోని కౌశల్యగంగలో గల కేంద్రీయ మంచి నీటి ఆక్వాకల్చర్ సంస్థ (సిఐఎఫ్ఎ–సిఫా) 6 రోజుల పాటు శిక్షణ ఇస్తోంది. మాధ్యమం ఆంగ్లం. చేపలు/ ఆల్చిప్పలు/ రొయ్యల సాగులో అనుభవం ఉన్న రైతులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ శాస్త్రవేత్తలు అర్హులు. బ్యాచ్‌కు 20 మందికి మాత్రమే అవకాశం. ముత్యాల సాగు చేపట్టాలనుకునే మహిళలకు 20% సీట్లు కేటాయిస్తారు. ఒక్కొక్కరికి ఫీజు రూ. 8 వేలు. సెప్టెంబర్ 1 నుంచి 5 వరకు శిక్షణా శిబిరం జరుగుతుంది. అయితే, దీనిలో చేరడానికి గడువు ఇప్పటికే ముగిసింది. తదుపరి బ్యాచ్‌లో చేరే ఆసక్తి

రూపుదాల్చుతుంది. న్యూక్లియస్ ఏ ఆకారంలో ఉంటే ముత్యం ఆ ఆకారంలో తయారవుతుంది. ఆల్చిప్పలను బక్కెట్లలో, ట్రేలలో పెట్టి నీటి తొట్టె/చెరువు నీటిలో ఉంచుతారు. స్పైరులిన, నాచు, వృక్ష ప్లవకాలను ఆహారంగా తీసుకుంటూ ఆల్చిప్పలు పెరుగుతాయి. ఇచ్చిన ఆహారాన్ని బట్టి 12 నుంచి 18 నెలల్లో ముత్యాల పంట చేతికి వస్తుంది. ఇలా సాగు చేసిన ముత్యాలను మతాచన్ ఆస్ట్రేలియా, కువైట్, సౌదీ అరేబియా, స్విట్జర్లాండ్‌కు ఎగుమతి చేసి భారీగా డబ్బు గడిస్తున్నారు. ముత్యాలను సేకరించిన తర్వాత మిగిలే ఆల్చిప్పలతో కూడా వివిధ కళాకృతులను తయారు చేస్తుండటం విశేషం.

'మన దేశపు మార్కెట్లలో అమ్మేవి కృత్రిమంగా తయారు చేసినవి. ఒరిజినల్ ముత్యాల్లాగ కనపడటానికి సింథటిక్ పెర్ల్ కోటింగ్ వేస్తారు. అందుకే చవక. సాగు చేసినవే నికార్సయినవి. వీటికి విదేశాల్లో క్యారెట్‌కు రూ. 360 పలుకుతుంది. అంటే గ్రాము రూ. 1,800. కిలో రూ. 18 లక్షలు..' అంటారు మతాచన్. కేరళలోని కాసర్‌గాడ్ జిల్లా (మలక్కల్లు పోస్టు) కడుతోడిల్ గ్రామంలో మతాచన్ ముత్యాల సాగు క్షేత్రం ఉంది. కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా అధికారులు, శాస్త్రవేత్తలు సైతం సందర్శనకు వస్తుంటారు. తన ఫామ్‌లో రైతులకు ముత్యాల సాగులో 26 రోజుల కోర్సు ద్వారా ప్రతి మెలకువనూ నేర్పిస్తున్నారు. ప్రస్తుతం వాట్సప్ ద్వారా ఆంగ్లంలో 26 రోజులపాటు రోజూ అరగంట సేపు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ అనంతరం ముత్యాల సాగు ప్రారంభించగలుగు తారని, అందుకు అవసరమైన వస్తువులను



గల వారు 'సిఫా' సీనియర్ సైంటిస్ట్ డా. శైలేష్ సౌరబ్‌ను సంప్రదించవచ్చు. Email: ssaurabh02@rediffmail.com

(సాక్షి సౌజన్యంతో )

లోపల ఎలావున్నా, పైకి ఆత్మ విశ్వాసం కనపడనీ.. అదే నీ ప్రత్యర్థులను బేజారెత్తిస్తుంది, నిన్ను గెలిపిస్తుంది

# వారి జీవితాలలో పాడిపరిశ్రమతో నవోదయం!

సమాజంలో తమపట్ల ఉన్న చెడు అభిప్రాయాన్ని తుడిచేయాలనుకున్నారు. అందరిలా గౌరవంగా బతకాలనుకున్నారు. అనుకున్నట్టుగానే ఇప్పుడు వారు సొంతంగా పాల కేంద్రాన్ని నిర్వహిస్తూ తమ కాళ్ల మీద తాము నిలబడ్డారు. దేశంలోనే ట్రాన్స్‌జెండర్ మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న మొట్టమొదటి మిల్క్ సొసైటీని విజయవంతంగా నడుపుతున్న తమిళనాడుకు చెందిన ట్రాన్స్‌జెండర్ మహిళల పాడి ప్రయాణమిది...



తూతుకూడి జిల్లాకు మూడు కిలోమీటర్ల దూరంలోని మంథితోపు గ్రామంలోని డెయిరీ ఫార్మ్ ఇప్పుడు 85 మంది ట్రాన్స్‌జెండర్ మహిళలకు ఇల్లు, బతుకునిచ్చే చోటు. అప్పటిదాకా చేయి చాచి బతికిన వారు ఇప్పుడు తలెత్తుకొని జీవిస్తున్నారు. జీవితంలో మొదటిసారి మేము అందరితో సమానం అని అనిపిస్తుంది. అవకాశాలు ప్రతి ఒక్కరిలోని నైపుణ్యం, సత్తాను చాటుతాయడానికి మా సహకార సంఘం నిరూపించింది. మాకు వచ్చిన ఈ అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకొని విజయం సాధిస్తాం. ఎన్ని కష్టాలు వచ్చినా సరే ఎదుర్కోగలమనే నమ్మకం, ధైర్యం మాకు ఉన్నాయి అని గర్వంగా చెబుతారు దేశంలోనే ట్రాన్స్‌జెండర్ మహిళల పేరుతో రిజిస్టర్ అయిన మొట్టమొదటి మిల్క్ సొసైటీకి అధ్యక్షురాలైన భూమిక. కోవిల్ పట్టిలోని మారుమూల గ్రామానికి చెందిన ఆమె ట్రాన్స్‌జెండర్ అన్న కారణంతో ప్రతి సంవత్సరం అయిదారు ఇళ్లు మారాల్సి వచ్చేది. ఎట్టకేలకు మాకు ఇప్పుడు ప్రశాంతత దొరికింది అంటారు భూమిక.

**కలెక్టర్ చొరవతో కొత్త జీవితం**

కొన్ని జిల్లాల్లో ట్రాన్స్‌జెండర్ మహిళల కోసం ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేశారు. అయితే తుతూకూడిలో అలా కాకుండా తమకు నివాసంతో పాటు జీవనోపాధి మార్గం కూడా చూపాలని తూతుకూడి జిల్లా కలెక్టర్ సందీప్ నందూరిని కలిసి ఏడాది క్రితం తమ గోడు విన్నవించారు ట్రాన్స్‌జెండర్ మహిళల హక్కుల కోసం పోరాడుతున్న గ్రేస్‌బాను. వారు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే నిరంతరం ఉపాధి పొందే ఏర్పాటు చేయాలనుకున్నారాయన.

అప్పుడే ఆయనకు డెయిరీ ఫార్మ్‌తో ట్రాన్స్‌జెండర్లకు స్థిరమైన ఉపాధి కల్పించవచ్చనే ఆలోచన వచ్చింది. ట్రాన్స్‌జెండర్ మహిళల పేరుతో మిల్క్ సొసైటీని రిజిస్టర్ చేయించారు. మంథతోపెలోని రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు అధికారులు. చీఫ్ మినిస్టర్ సోలార్ పవర్డ్ గ్రీన్‌హౌజెస్ ఫర్ ట్రాన్స్‌జెండర్ల కోటా కింది అందరికీ ఇళు కట్టించారు. మైన్స్ డిపార్ట్‌మెంట్ వాళ్లు రోడ్లు వేశారు. పశు సంరక్షణ అధికారుల సూచనల ప్రకారం ఆవుల కోసం షెడ్డు నిర్మించారు.

ఛీఫ్ మినిస్టర్ గ్రీన్‌హౌజ్ ఇనీషియేటివ్ కింద షెడ్డు ఇళ్లకు



సరియైన పోటీ లేకుంటే, శక్తియుక్తులకు రాణింపు వుండదు



రెవెన్యూ స్కిల్ డెవల్‌పమెంట్ పశుసంరక్షణ సహకార సంఘం రూరల్ డెవల్‌పమెంట్ సంస్థల సహకారంతో ఈ ప్రాజెక్ట్ ఆచరణలోకి వచ్చింది. ఈ సెప్టెంబర్ మొదటి వారంలో కలెక్టర్ సందీప్ ట్రాన్స్‌జెండర్ మహిళల ఆధ్వర్యంలో నడిచే డెయిరీ ఫార్మ్‌ను ప్రారంభించి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు.

ట్రాన్స్‌జెండర్లు తమ కాళ్ల మీద తాము నిలబడేలా చేయడం వారికి స్థిరమైన ఆదాయ మార్గం చూపడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం అంటారు ప్రాజెక్ట్ డైరెక్టర్ ధనపథి. రాబోయే రోజుల్లో ట్రాన్స్‌జెండర్లకు పేపర్ ప్లేట్స్ తయారీ ద్వారా జీవనోపాధి చూపాలనే ఆలోచనలో ఉన్నామని కలెక్టర్ తెలిపారు. తమకు బతుకు దారి చూపిన కలెక్టర్ మీద అభిమానంతో తమ కాలనీకి సందీప్ నగర్ అని పేరు పెట్టారు. ■

సౌర విద్యుత్ ఏర్పాట్లు చేశారు. రెండు పాడి ఆవులను కొనేందుకు ఒక్కొక్కరికి లక్ష చొప్పున రుణం ఇప్పించారు. మొదటి విడతగా 30 ఆవులను కొన్నారు. ఆవులను మేపడం, పాలు పితకడం గురించి పది రోజులు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న పాల ఉత్పత్తిదారుల సహకార సంస్థ ఆవిన్ వీరి కేంద్రం నుంచి ఉదయం, సాయంత్రం పాలు తీసుకెళ్లేందుకు ముందుకు వచ్చింది.

# ప్రాణ శక్తిని, పోషణ శక్తిని పెంచే ఉసిరి !

**వి**టమిన్లు, లవణాలు, ఎంజైములు వీటికోసం ప్రతిరోజూ మనం పలురకాల ఆహార పానీయాలు తీసుకోవచ్చు. అయితే అలా తీసుకున్న వాటిలో ఏ ఒక్క అంశాన్నీ శరీరం గ్రహించలేకపోతే ఏమవుతుంది? ఎంతో పౌష్టికాహారం తీసుకుంటున్నాం కదా అని మనం అనుకుంటాం. కానీ రోజురోజుకూ శరీరం క్షీణిస్తుంటుంది.

అయితే ఉసిరికాయను ఆహారపానీయాలతో కలిపి తింటే, మనం తీసుకున్న ఆహారంలోని పోషకాలు శరీరానికి బాగా వంటబడతాయి. వీటితోపాటు జీర్ణాశయంలోని ఆమ్లాలను సమస్థితికి తేవడం, కాలేయాన్ని ఉత్తేజితం చేయడం, మెదడు శక్తిని పెంచడం, ప్రాణశక్తిని పెంచడం, కండరాల పటుత్వాన్ని పెంచడం, శ్వాసకోశల బలాన్ని పెంచడం, శరీరానికి హాని చేసే ఫ్రీ ర్యాడికల్స్‌ను, శరీరంలో పేరుకు పోయిన వ్యర్థపదార్థాలను బయటికి పంపడం వంటి విధులన్నీ ఉసిరి సమర్థవంతంగా నిర్వహిస్తుంది.



వీటితోపాటు రక్తనాళాల్లో ఆటంకాలు ఏర్పడకుండా చేయడం, చెడు కొలెస్ట్రరాల్‌ను తగ్గించడం వంటి ప్రక్రియలు కూడా ఉసిరి వల్ల సాధ్యమవుతాయి. చర్మసౌందర్యాన్ని పెంచడంలో కూడా ఉసిరి పాత్ర కీలకమే. ఉసిరిని రసంగా, మురబ్బాగా, పచ్చడిగా, చట్నీగా ఇలా ఏ రూపంలో తీసుకున్నా ఉసిరి ఫలితాలు పరిపుష్టంగా లభిస్తాయి. □

# తగిన జాగ్రత్తలతో కంటి చూపు పదిలం !

**స**ర్వేంద్రియాణాం నయనం ప్రధానం అన్న నానుడి వినే ఉంటారు. అన్ని అవయవాల్లోకి కళ్ళు చాలా కీలకం. జీవితంలో కంటి చూపు ప్రధానం. తన కళ్ల ముందున్న ప్రపంచాన్ని చూసే అదృష్టం అందరికీ వుండదు. ఆ అదృష్టం ఉన్నవారు దాన్ని కాపాడుకునేందుకు ఎంతో శ్రద్ధ చూపాల్సి ఉంటుంది. కంటి సమస్య చిన్నదైనా సరే 'ఆ ఏముందిలే' అని తీసిపారేయవద్దు. ఏ సమస్య దేనికి దారి తీస్తుందో? చివరికి చూసే యోగంలేకుండా చేస్తుందేమో తస్మాత్ జాగ్రత!

చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఏడాదికో సారైనా కంటి డాక్టర్ దగ్గరకు వెళ్ళి పరీక్షలు చేయించు కోవడం ఎంతో అవసరం. ఏటా లక్షల సంఖ్యలో కంటి చూపునకు సంబంధించిన సమస్యలతో బాధపడుతూ వైద్యులను సంప్రదిస్తున్నారు. వీటిలో కొన్ని శాశ్వత అంధత్వానికి దారితీసేవి కూడా ఉంటున్నాయి. కొందరికి కళ్ళద్దాలు, మందులతోనే సరిపోవచ్చు. ఇంకొందరికి సర్జరీలతో నయంచేయడానికి అవకాశం ఉండవచ్చు. కాని మరి కొందరి విషయంలో అప్పటికే చేయి దాటి వుంటుంది!

**పైకి కనిపించకపోవచ్చు....**

కొన్ని సమస్యలు పైకి కనిపించవు. అయితే కొంత కాలానికి జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. అదే వైద్యులను సంప్రదించినట్టయితే పరీక్షల ద్వారా సమస్యలను గుర్తించేందుకు వీలుంటుంది.

కాంప్రహెన్సివ్ డైలేటెడ్ ఐ ఎగ్జామ్ : చాలావరకు కంటి సమస్యలు ఈ పరీక్ష ద్వారా బయటపడతాయి. గ్లకోమా, డయాబెటిక్, వయసును బట్టి వచ్చే మాక్యులర్ డీజనరేషన్ ఏఎండీ సమస్యలు తెలుస్తాయి.

**కుటుంబ ఆరోగ్య చరిత్ర**

కొన్ని వ్యాధులు వారసత్వంగా సంక్రమిస్తుంటాయి. మీ కుటుంబ సభ్యుల ఆరోగ్య సమాచారాన్ని వైద్యులకు తెలియచేయడం అవసరం. అప్పటికే కుటుంబంలో ఎవరైనా కంటి వ్యాధులతో బాధపడుతుంటే అవి వారసత్వంగా మీకూ వచ్చే ముప్పు ఎక్కువగా ఉంటుంది. మీకు ఏదైనా కంటి సమస్య వున్నట్టు బయటపడితే అది వారసత్వంగా వచ్చిందా, కాదా? అన్నది తెలుస్తుంది. దాన్నిబట్టి వైద్యం చేసేందుకు వీలుంటుంది.

**కన్ను పనితీరు**

కంటిలో ముందు భాగంలో కనిపించే కార్నియా ద్వారా కాంతి లోపలికి ప్రసారం అవుతుంది. ఐరిస్ ఈ కాంతి ఎంతమేరకు అవసరమో ఆమేరకే కనుపాప తెరచుకునేలా నియంత్రిస్తుంది. కనుపాప వెనుక కటకాలు(లెన్స్)ఉంటాయి. ఈ లెన్స్ తనకు చేరిన చిత్రాలను ఎలక్ట్రానిక్ సంకేతాల రూపంలో రెటీనాకు పంపిస్తుంది. ఈ సంకేతాలు రెటీనా నుంచి ఆప్టిక్ నెర్వ్ ద్వారా మెదడుకు వెళతాయి. దాంతో మన కళ్ళ ముందు ఏమున్నదీ మెదడుకు తెలిసిపోతుంది.

**ఎలాంటి ఆహారం**

ముదురు ఆకుపచ్చటి కూరగాయలు, పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. ముఖ్యంగా పాలకూర మంచి ఛాయిస్. చేపలు కంటి చూపును కాపాడే మంచి బలమైన ఆహారమట. వీటిలో ఉండే ఒమేగా ఫ్యాటీ 3 యాసిడ్స్ కంటిని కాపాడతాయంటు న్నారు నిపుణులు. చేపలు తినలేనివారు వాల్ నట్స్ తీసుకోవడం మంచిది. వీటిలోనూ ఒమేగా ఫ్యాటీ 3 యాసిడ్స్ లభిస్తాయి. ముఖ్యంగా విటమిన్ ఏ ఎక్కువగా లభించే క్యారట్లు కళ్ళకు మంచివి. అలా అని ఒక్క క్యారట్లే తినడం కూడా సరికాదు. పైన చెప్పుకున్నవి కూడా ఆహారంలో భాగం కావాలి. మొలకెత్తిన గింజలు కూడా మంచివి.

కళ్ళకు, మెదడుకు మధ్య అనుసంధానం చాలా కీలక మైనది. ప్రతి కణం చక్కగా పని చేసేందుకు వీలుగా ఎన్నో ఛానల్స్ నిర్మాణమై ఉంటాయి. కణాలు ఒకదానితో ఒకటి అనుసంధానమై పనిచేయడంవల్ల కంటి చూపు బాగుం టుంది. ఇందులో రెటీనా, స్కెలరా, ప్యూపిల్, ఐరిస్, కార్నియా, లెన్స్, మాక్యులా, ఆక్వియెస్, విట్రియెస్ హ్యూమర్, ఆప్టిక్ డిస్క్, ఆప్టిక్ నెర్వ్ మొదలైనవి ఉంటాయి. వీటి మధ్య సమాచారం

మేధాశక్తి క్షీణించడం మొదలైందనడాకి, విసుగు తొలి సంకేతం

సరిగా సాగేందుకు వీలుగా తగిన పోషకాలు అవసరమవుతాయి. ల్యూటీన్, జెక్సాంతిన్, క్రిప్టోక్సాంతిన్, బెటా కెరోటిన్, జింక్, బయోఫ్లేవనాయిడ్స్, విటమిన్ ఎ, సి అనేవి రెటీనాలోని కణాలు సరిగా పని చేసేందుకు అవసరం.

**బరువు పెరిగినా కళ్ళకు ముప్పే**

ఊబకాయం వంటి సమస్యలతో మధుమేహం ముప్పు ఎక్కువగా ఉంటుంది. మధుమేహం నాడీ వ్యవస్థను బలహీన పరుస్తుంది. అలాగే గ్లకోమాకు దారితీస్తుంది. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ బరువు పెరగకుండా చూసుకోవాలి. అది మీవల్ల కాకపోతే వైద్యులను సంప్రదించాలి.

**పొగ తాగినా అంతే....**

పొగతాగడం వల్ల దీర్ఘకాలంలో కంటిచూపు దెబ్బ తింటుందనేది చాలామందికి తెలియని విషయం. పొగతాగడం వల్ల మాక్యులర్ డీజనరేషన్ సమస్యకు దారితీస్తుంది. కేటరాక్ట్, ఆప్టిక్ నరాలు దెబ్బతింటాయి. దీంతో చివరకు అంధత్వం ఏర్పడుతుంది.

**సాధారణంగా కనిపించే సమస్యలు**

మయోపియా లేదా దగ్గరి చూపు మందగించడం, హైపరోపియా లేదా దూరదృష్టి తగ్గడం, ఆస్టిగ్ మ్యాటిజమ్, ప్రెస్బియోపియామొదలైనవి.

**ఏజ్ రిలేటెడ్ మాక్యులర్ డీజనరేషన్ (ఏఎండీ)**

ఈ సమస్య 50ఏళ్ళకు పైడినవారిలో వస్తుంది. వయసు పెరుగుతున్నకొద్దీ ఇబ్బంది కూడా అధికం అవుతుంది. పొగతాగేవారిలో ఈ ముప్పు రెండు రెట్లు అధికంగా ఉంటుంది. కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఉంటే వారసులకు వచ్చే ముప్పు కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఏఎండీ సమస్యలో రెటీనాలోని మాక్యులాకు రక్త ప్రసారం తగ్గుతుంది. దీనివల్ల చూపు క్షీణిస్తుంది. దీనికి చికిత్స లేదు.

**కేటరాక్ట్**

వయసు పెరుగుతుంటే కంటిలో శుక్లం ఏర్పడడం ఎక్కువ శాతం కనిపించే సమస్య. ప్రపంచంలో 51 శాతం అంధత్వానికి ఇదే కారణమట.

■

## ఈ లక్షణాలు వుంటే డాక్టర్ అత్యవసరం!

- ఎర్రబారి, కంట్లో నొప్పిగా ఉంటే ఆలస్యం చేయకుండా కంటి డాక్టర్ వద్దకు వెళ్ళాలి.
- ఉన్నట్టుండి పాక్షికంగా, పూర్తిగా కంటి చూపు మందగిస్తే...
- ఎదురుగా ఉన్నవి రెండుగా కనిపిస్తే
- కంటి పాప ముందు నల్లటి చుక్కలు కనిపిస్తే
- ఏదో కంటిచూపునకు అడ్డంగా ఉన్నట్టు అనిపిస్తుంటే...
- కుడి, ఎడమవైపుల ఉన్నవి కనిపించకుంటే... రాత్రి సమయాల్లో చూపు మందగించినట్టు అనిపిస్తే...
- రంగుల మధ్య తేడాను గుర్తు పట్టలేకుంటే
- దగ్గర్లో ఉన్న వస్తువులు మసకబారినట్టు అనిపిస్తుంటే
- కళ్ళ వెంట నీరు కారుతుంటే...బాగా దురదగా అనిపిస్తుంటే ...
- అధిక కాంతి వల్ల రాత్రి వేళల్లో ఇబ్బంది పడుతుంటే కంటి వైద్యుడి సూచన మేరకు యాంటీగ్లేర్ కోటింగ్ ఉన్న గ్లాసెస్‌ను వాడుకోవాలి.
- చలువ కళ్ళద్దాలు పెట్టుకున్నప్పటికీ సూర్యుడి వైపు చూడొద్దని నిపుణుల సూచన.
- కంప్యూటర్ వాడేవారు తమ కళ్ళకు, మానిటర్‌కు మధ్య కనీసం అడుగు దూరం వుండేలా శ్రద్ధ వహించాలి. కంప్యూటర్ ముందు కూర్చున్నప్పుడు మీ వెనుక వైపున లైట్, కిటికీ ఉండరాదు. ఎందుకంటే ఆ వెలుగు స్క్రీన్‌పై పడి గ్లేరింగ్ ఉంటుంది.
- కళ్లలో పెట్టుకునే కాంటాక్ట్ లెన్స్ కళ్లలో అమర్చుకునే ముందు, తర్వాత తీసే సమయంలోనూ కళ్లను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం చాలా అవసరం.
- నీలి రంగు కళ్ళకు హానికరం. అందుకే కంప్యూటర్ సెట్టింగ్స్‌ను తగిన విధంగా మార్చుకోవాలి.

□

# ఏపిమాస్ విజ్ఞాన భాండాగారం !

## ప్రచురణలు / రూపకల్పనలు

### తెలుగు విభాగం

- గ్రామ సంఘ పాలకవర్గ విధులు – బాధ్యతలు
- గ్రామ సంఘ మహాసభ సమావేశములు
- గ్రామ సంఘ పాలకవర్గ సమావేశములు
- జీవనోపాధి
- సహభాగ శిక్షణ
- సుస్థిరత
- ప్రగతిపథం
- పరిష్కారం
- స్వయం సహాయ సంఘాలు – వెలుగునీడలు
- మ్యాక్స్ చట్టం
- సమాచార హక్కు చట్టం
- ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ జీవనోపాధులు
- జీవనోపాధుల వనరుల కేంద్ర సేవలు మరియు వ్యాపారాభివృద్ధి ప్రణాళిక
- పొదుపు మహిమ
- అప్పుల మహిమ
- స్వయం సహాయ సంఘాల పుస్తక నిర్వహణ అభ్యాసములు
- స్వయం సహాయ సంఘాల పుస్తక నిర్వహణ అభ్యాసము పట్టికలు
- స్వయం సహాయ సంఘాల బహిర్గత లెక్కల తనిఖీ
- స్వయం సహాయ సంఘాల వార్షిక ప్రణాళిక
- సమాఖ్యలలో పుస్తక నిర్వహణ
- సమాఖ్యల అంతర్గత లెక్కల తనిఖీ
- సమాఖ్యల బహిర్గత లెక్కల తనిఖీ
- ఎన్నికల విధానం
- సమాఖ్యల వార్షిక ప్రణాళిక
- ఉత్తమ ప్రతిభా పురస్కారాలు
- ఆర్థిక పట్టికలను అర్థం చేసుకోవడం
- మన సంఘాలు, సమాఖ్యలలో మిగులు నిర్వహణ
- మన స్వయం సహాయ సంఘాలలో వడ్డీ నియమము, లెక్కింపు
- బాగుపడిన బతుకులు ... (పల్లెసీమల కళారూపాలు)
- కరువు నుంచి కలిమికి.... కొన్ని ఆణిముత్యాలే
- బ్రతుకుతెరువు (సీడి)
- చేయిచేయి కలుపుదాం-ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్స్‌పై విడియో చిత్రం (సీడి)
- గమ్యం – విడియో చిత్రం (సీడి)
- గ్రామ సంఘ సేవలు – ఆడియో (సీడి)
- జీవనోపాధులు పోస్టర్
- మ్యాక్స్ పోస్టర్
- చెట్టు చేసే మేలు (పోస్టర్)

## Publications/Creations

### English Section

| | |
|---|---|
| A Study on SHG Bank Linkage in Andhra Pradesh | 200/- |
| Board of Directors Meeting of Village Organisation | 50/- |
| Roles and Responsibilities of Board of Directors of Village Organisation | 50/- |
| General body meeting of Village organisation | 50/- |
| Pragathi Patham | 100/- |
| Rural Livelihoods in Andhra Pradesh | 100/- |
| A Handbook for Trainers on SHG Federation (English & Hindi) each 350/- | 350/- |
| **Sector Owned Control booklets set:** Eng, Hindi, Telugu | **1000/-** |
| The Significance of Savings | 50/- |
| The Significance of Loans | 50/- |
| SHG Bookkeeping | 100/- |
| Reconstruction of Accounts in SHGs | 40/- |
| SHG External Audit | 50/- |
| Annual Planning for SHGs | 50/- |
| SHG Federation Bookkeeping 100/- | |
| SHG Federation Internal Audit | 50/- |
| SHG Federation External Audit | 40/- |
| Election Process in SHGs & Federations | 50/- |
| Annual Planning for SHG Federations | 70/- |
| Best Performance Award | 50/- |
| Understanding Financial Statements | 50/- |
| Surplus Management in SHGs & Federations | 50/- |
| Fixation and Calculation of Interest in SHGs | 40/- |
| Management Information Systems in SHGs | 40/- |
| Management Information Systems in Federations | 40/- |
| Model Annual Report SHGs &SHG Federations | 50/- |
| Financial Management in our Federation | 50/- |
| **Formers Producer Organisation BOD Self learning Modules set 6 books** | **600/-** |
| Jagriti- Farmer Producers Organisation Introduction & Rationale | 100/- |
| Parikalpana – Institutional Structure & Design of Farmer Producers Organisation | 100/- |
| Vinimaya – Membership In Farmer Producers Organization | 100/- |
| Prerana – Governance In Farmer Producers Organisation | 100/- |
| Samarthanana – Management of Farmer Producers Organisation | 100/- |
| Sudharma – Legal Compliances of Farmer Producers Organisation | 100/- |
| **Farmers Producer Organisation BOD Self learning Posters set** | **600/-** |
| SHG Federation (Hindi&Telugu)each CD | 200/- |
| CD - Sector Owned Control (SOC) | 200/- |
| SOC Posters(Tel.&Hindi&Eng) each set | 350/- |

MAHILA SADHIKARATHA
Publication Date: 01-10-2020; Posting Date: 05-10-2020

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2018-20





శ్రీ సి ఎస్ రెడ్డిచే చిత్తూరు జిల్లా గోరంట్లపల్లి , జనగాంపల్లి , గూడరేవుపల్లి పాఠశాలల సందర్శన





'యాక్షన్ ఫ్రెటర్నా' శ్రీ మల్లారెడ్డితో శ్రీ సి ఎస్ రెడ్డి బృందం . . . చిత్తూరు జిల్లా కురబలకోట మండలంలో ఏపిమాస్ చొరవతో కొత్తగా ఏర్పాటైన రైతు సంఘాలలో కొన్నిటి సమావేశాలు





అనంతపురం జిల్లా జె సి శ్రీ నిశాంత్ కుమార్ నిర్వహించిన సమావేశంలో ఏపిమాస్ ప్రతినిధులు . . . పీలేరు ఎఫ్ పి సి ని సందర్శించిన ఏ డి ఏ . . . గజరాంపల్లి పత్తిచేను పరిశీలన





జి ఎం ఎస్ వర్క్‌షాప్ . . . చంద్రుగొండలో ఎస్ వి ఇ పి- సిఆర్‌పి- ఇ పి లకు శిక్షణ

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089